

ప్రత్యేక అలంకరణలో వెంగమాంబ పేరంటాలు

వైభవంగా వెంగమ్మ తిరునాళ్ల ప్రారంభం

- అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు
- పసుపు దంచేందుకు పోటీ పడ్డ మహిళలు
- వలసవాసుల రాకతో గ్రామాల్లో పండుగ వాతావరణం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూన్ 23: రాష్ట్రంలోనే పేరుగాంచిన దుత్తలూరు మండలం నర్రవాడ వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వెంగమాంబ వంశస్తులయిన పచ్చవ కుటుంబ సభ్యులు అమ్మవారికి పసుపు, కుంకుమ తీసుకువచ్చి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. వేదపండితులు అమ్మవారికి పుష్పాలంకరణ చేసి, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలతో హోమాలు చేయించారు. అనంతరం కలశాలను మంగళవాయిద్యాలు, బాణసంచా వేడుకల మధ్య అమ్మవారి సన్నిధికి చేర్చారు. మొదటి రోజు దూరప్రాంతాల నుంచి భక్తులు అధికంగా హాజరయ్యారు. పలువురు మహిళలు భక్తితో పొంగళ్లు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. సంతానం లేని మహిళలు అమ్మవారి సన్నిధిలో వరపడ్డారు. వెంగమాంబ దేవర ఇంట్లో జరిగిన పూజలకు భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు.

● పసుపు దంచేందుకు పోటీ

వెంగమాంబ స్వగ్రామం వడ్డిపాళెంలోని పచ్చవ దేవర ఇంట్లో పసుపు దంచే కార్యక్రమం వైభవంగా జరిగింది. పసుపు దంచే కార్యక్రమంలో పాల్గొంటే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం. సంతానం లేని మహిళలు కూడా పసుపు దంచేందుకు పోటీ పడ్డారు. పచ్చవ దేవర ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు, ఆలయ ఈవో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. మొక్కుబడి ఉన్న భక్తులు కుటుంబ సమేతంగా తల నీలాలు సమర్పించుకున్నారు. కావలి డీఎస్పీ వెంకటరమణ, ఉదయగిరి సీఐ గిరిబాబు, ఎస్‌ఐలు ఉమాశంకర్, తిరుపతయ్య తమ సిబ్బందితో బందోబస్తును పర్యవేక్షించారు.

● గ్రామాల్లో సందడి

బ్రహ్మోత్సవాలకు వలస వాసులు చేరుకోవడంతో గ్రామాల్లో సందడి నెలకొంది. స్థానికులేకాక గుంటూరు, విజయవాడ, ఒంగోలు, చెన్నై, బెంగళూరు, హైదరాబాదు, విశాఖపట్నం ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు ఈ ఉత్సవాలకు తరలివచ్చారు. బంధుమిత్రులతో గ్రామాలు కళకళలాడాయి.

ఉత్సవాల్లో నేడు

సోమవారం వెంగమాంబ దంపతుల విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. గ్రామోత్సవంలో బాణసంచా వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.



కలశాలను అమ్మవారి సన్నిధికి తీసుకువస్తున్న ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు



వడ్డిపాళెంలోని దేవర ఇంట్లో పసుపు దంచుతున్న భక్తులు

'మద్దతు' చాలదు !

- పెంచాలని రైతుల డిమాండ్
- క్వింటా ధాన్యం రూ.2,300లకు పెంపు
- గత ఏడాది కంటే రూ. 117 అదనం
- అయినా గిట్టుబాటు కాదంటున్న అన్నదాతలు
- రాష్ట్ర ప్రభుత్వం రూ. 50 బోనస్‌గా ప్రకటించాలంటున్న కర్షకులు



లారీకి ధాన్యం లోడ్ చేస్తున్న కూలీలు(ఫైల్)

సంగం, జూన్ 23: రైతులు పండించే వివిధ పంటలకు కేంద్ర ప్రభుత్వం గత వారంలో మద్దతు ధరలను ప్రకటించింది. గతేడాది క్వింటా ధాన్యం మద్దతు ధర రూ. 2,183గా ఉండగా ఈ ఏడాది అదనంగా రూ. 117 పెంచి రూ. 2,300గా ప్రకటించింది. పెంచిన ధరలతో పోలిస్తే ఈసారి సాగు ఖర్చులు విపరీతంగా పెరిగినా, సాధారణంగానే మద్దతు ధరలు పెంచారని రైతులు పేర్కొన్నారు. ఇటీవల కాలంలో వివిధ పంటల సాగుకు ఖర్చులు రెట్టింపైనా, దిగుబడులు మాత్రం అంతంతమాత్రంగానే ఉంటున్నాయని అన్నదాతలు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా బోనస్‌గా మరికొంత మొత్తాన్ని పెంచాలని వారు కోరుతున్నారు.ఇందుకు ప్రధాన కారణం గతేడాది ప్రకటించిన మద్దతు ధర కంటే ఈ ఏడాది ప్రకటించిన మద్దతు ధర తక్కువ కావడమే. 2023-24 సీజన్‌లో రూ. 143 పెంచారు. దీంతో రూ. 2040 ఉన్న క్వింటా ధాన్యం రూ. 2,183కి పెరిగింది. ఈ ఏడాది రూ. 117 పెంచారు. అంటే క్వింటాకి రూ. 26లు తగ్గింది. దీన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం మరో రూ. 50 బోనస్ రూపంలో పెంచాలని కర్షకులు కోరుతున్నారు.

2024- 25 ఏడాదికి కేంద్రం ప్రకటించిన మద్దతు ధరలు

పంట	గతేడాది ధర	ఈ ఏడాది ధర	పెరుగుదల
వరి సాధారణ	2,183	2,300	117
వరి ఏ- గ్రేడ్	2,203	2,320	117
పత్తి	6,620	7,121	501
మొక్కజొన్న	2,090	2,225	135
నువ్వులు	8,835	9,287	632
వేరుశనగ	6,377	6,783	406
రాగులు	3,846	4,290	444
మినుములు	6,950	7,400	450
పెసలు	8,558	8,682	124
కందులు	7,000	7,550	550

● జిల్లాలో వరి సాగే ప్రధానం

ఉమ్మడి నెల్లూరుజిల్లాలో ఉన్న సోమశిల, కండలేరు జలాశయాలు, కనిగిరి, సర్వేపల్లి రిజర్వాయర్లతోపాటు చెరువులు, బోరు పాయింట్ ద్వారా సాగు చేస్తున్న పంటల్లో వరి ప్రధానమైనది. అత్యధిక సంఖ్యలో రైతులు వరిపైనే ఆధార పడి జీవిస్తున్నారు. తరువాత ఉద్యానతోటలతోపాటు, వాణిజ్య పంటలైన మినుము, పెసర, పత్తి, వేరుశనగ వంటి పంటలు సాగు చేస్తారు. ప్రస్తుతం పంటల సాగుకు పెట్టుబడులు భారీగా పెరిగాయి. ఎకరా వరి సాగుకు రూ. 30 నుంచి రూ.35 వేలు పెట్టుబడి అవుతుందని, అయినా దిగుబడులు అంతంత మాత్రంగానే వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. చేతకందిన పంటను అమ్ముకుందామంటే ఆ స్థాయిలో మద్దతు ధర పెరగడం లేదని వారు ఆవేదన చెందుతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం పెంచిన ధర రూ. 117కు అదనంగా మరో రూ. 50 రాష్ట్ర ప్రభుత్వం పెంచాలని రైతులు కోరుతున్నారు. అలాగే వరి ధాన్యంతోపాటు పత్తి, మొక్కజొన్న, మినుములు, పెసర, కందులు, నువ్వులు, వేరుశనగ, రాగులు తదితర పంటలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలు ప్రకటించింది.

సమర్థతకు గుర్తింపు

- ఉమ్మడి నెల్లూరు జిల్లా పూర్వ కలెక్టర్లకు కీలక పోస్టింగ్‌లు
- వ్యవసాయశాఖ ప్రత్యేక కార్యదర్శిగా బుడితి రాజశేఖర్
- సీఎంవోలో రవిచంద్రకు బాధ్యతలు
- ఆర్థికశాఖ కార్యదర్శిగా జానకి
- పోలా భాస్కర్‌కు ఉన్నత విద్యాశాఖలో పదవి



రాజశేఖర్ · రవిచంద్ర · జానకి · పోలా భాస్కర్

నెల్లూరు(హరనాథపురం), జూన్ 23: ఉమ్మడి నెల్లూరు జిల్లాలో కలె క్టర్లుగా పనిచేసిన పలువురు రాష్ట్రస్థాయిలో కీలక పదవుల్లో నియమితుల య్యారు. వారంతా ముక్కుసూటిగా వ్యవహరించటమేకాకుండా, జిల్లా అభివృద్ధికి ఎంతగానో శ్రమించారు. ప్రజల కోసం పనిచేసి వారి మన్ననలు పొందారు. జిల్లా కలెక్టర్లుగా బుడితి రాజశేఖర్, ముద్దాడ రవిచంద్ర, ఎం. జానకి పనిచేశారు. అలాగే జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్‌వో)గా పోలా భాస్కర్ పనిచేశారు. వీరంతా తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి, జిల్లాలో మంచి గుర్తింపు పొందారు.

● బుడితి రాజశేఖర్

బుడితి రాజశేఖర్ ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 86వ కలెక్టర్‌గా పనిచేశారు. ఈయన 1992వ బ్యాచ్ ఐఏఎస్‌కి చెం దినవారు. 2004 నుంచి 2005 వరకు జిల్లా కలెక్టర్‌గా పనిచేసి మంచి పేరు సంపాదించారు. ప్రజా సమస్యలు పరిష్కరిం చటంలో ప్రత్యేకత చాటుకున్నారు. ప్రస్తుతం చంద్రబాబు ప్రభుత్వంలో వ్యవసాయశాఖ ప్రత్యేక కార్యదర్శిగా నియమితులయ్యారు.

● ముద్దాడ రవిచంద్ర

ముద్దాడ రవిచంద్ర 1995వ బ్యాచ్ ఐఏఎస్‌కు చెందిన వారు. జిల్లాలో 87వ కలెక్టర్‌గా ఆయన అందించిన సేవలు మరువలేవి. 2005 నుంచి 2008 వరకు జిల్లా కలెక్టర్‌గా పనిచేసి ప్రజా మన్ననలను పొందారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో సీఎం ముఖ్యకార్య దర్శిగా నియమితుల య్యారు. అందరితో కలగలుపుగా ఉంటూ సమస్యలు తెలుసుకుని, పరిష్కరించే వ్యక్తిగా ఆయనకు పేరుంది.

● ఎం. జానకి

ఎం. జానకి 91వ కలెక్టర్‌గా జిల్లాలో పనిచేశారు. 2014 నుంచి 2016 వరకు సేవలందించారు. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకుని పరిష్కరించారు. స్పందన అర్జీల పరిష్కారంలో కూడా ఆమె తనదైన ప్రత్యేకతను చాటుకున్నారు. చంద్ర బాబు ప్రభుత్వంలో ఆర్థిక శాఖ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు.

● పోలా భాస్కర్

పోలా భాస్కర్ డీఆర్‌వోగా పనిచేశారు. 2001-04 మధ్యకాలంలో ఇక్కడ కొనసాగారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించటమే కాక, రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి అందరి మన్ననలు పొందారు. ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వంలో ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.



నెల్లూరు భగత్‌సింగ్ కాలనీలో నిర్మాణంలో ఉన్న వైసీపీ జిల్లా కార్యాలయ భవనం

రూ.కోట్లు విలువైన భూమిపై 'గోలీజు'!

- అనుమతుల్లేకుండా వైసీపీ కార్యాలయ నిర్మాణం
- ఇప్పటికే 80 శాతం పనుల పూర్తి
- ఏడాదిగా కన్నెత్తి చూడని అధికార యంత్రాంగం
- తాజాగా వెలుగులోకి రావడంతో సంచలనం
- నోటీసులు అందజేసిన అధికారులు

నెల్లూరు (ఆంధ్రజ్యోతి), జూన్ 23 : 'అధికారం చేతుల్లో ఉంది. ఇక మమ్మల్ని అడిగేవారెవరు!?' అన్న ధీమాతో నెల్లూరు నగరంలో రూ.కోట్లు విలువజేసే స్థలంపై వైసీపీ నాయకులు కన్నేశారు. 'లీజు' పేరు సదరు స్థలాన్ని చేజిక్కించుకుని ఏకంగా వైసీపీ జిల్లా కార్యాలయ నిర్మాణాన్ని చేపట్టారు. ఇంత జరుగుతున్నా పాలక పెద్దల ఒత్తిళ్లు.. మరే కారణాలో తెలియవు కానీ అధికార యంత్రాంగం అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. చివరకు ఫిర్యాదులు అందడంతో కార్పొరేషన్ అధికారులు సదరు భవనాన్ని పరిశీలించి, వైసీపీ జిల్లా అధ్యక్షుడికి నోటీసులు అందజేశారు.

నెల్లూరు నగరంలోని భగత్‌సింగ్ కాలనీ వద్ద 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో పేదల కోసం టిడ్కో ఇళ్ల కోసం భూమిని సేకరించారు. కొంత భూమిలో టిడ్కో ఇళ్లు నిర్మించగా, మిగిలిన భూమి ఖాళీగా ఉంది. అందులో రెండెకరాలను నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ కార్యాలయ నిర్మాణానికి గత ప్రభుత్వం కేటాయించింది. అది కూడా 33 ఏళ్లపాటు లీజుకు ఇచ్చింది. ఎకరాకు ఏడాదికి రూ.1000 లీజు చొప్పున కేటాయించడంపై అప్పట్లోనే తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ప్రస్తుతం ఆ ప్రాంతంలో ఎకరం విలువ రూ.4 కోట్లు వరకు ఉంది. అంటే రూ.8 కోట్ల విలువ చేసే భూమిని వైసీపీ కార్యాలయానికి అతితక్కువ ధరకు ధారాదత్తం చేశారు. ఏడాది క్రితం పనులు ప్రారంభవమగా ఇప్పటికి 80 శాతం వరకు నిర్మాణం పూర్తయ్యింది. రూ.లక్షల పన్ను ఎగ్గొట్టి వైసీపీ పెద్దలు తమ పార్టీ కార్యాలయాన్ని నిర్మించారు. దీనిపై తాజాగా రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదులు అందడంతో శనివారం కార్పొరేషన్ అధికారులు రంగంలోకి దిగారు. నిర్మాణంలో ఉన్న పార్టీ కార్యాలయాన్ని పరిశీలించారు. ఆ భవనం 1000 చ.మీ విస్తీర్ణం దాటడంతో నుడా అధికారుల అనుమతులపై ఆరా తీశారు. చివరకు ఎలాంటి అనుమతులు లేవని తేల్చారు. ఈ క్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి నోటీసులు అందజేసినట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై వివరణ కోరేందుకు కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్‌ను సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు. నుడా అధికారులు మాత్రం తాము ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని చెప్పడం గమనార్హం.

● వారంలో వివరాలు ఇవ్వండి : కార్పొరేషన్ నోటీసులు

నెల్లూరు(సిటీ) : నెల్లూరు భగత్‌సింగ్ కాలనీలో నిర్మాణంలో ఉన్న వైసీపీ కార్యాలయానికి అనుమతి లేదనే ఆరోపణలు రావడంతో కార్పొరేషన్ అధికారులు ఆ భవనాన్ని పరిశీలించారు. భవన నిర్మాణ అనుమతులు చూపాలంటూ వైసీపీ నాయకులకు మౌఖిక ఆదేశాలు ఇవ్వగా, స్పందన రాకపోవడంతో నోటీసు జారీ చేశారు. వారంలోగా తమకు అనుమతి పత్రాలు చూపాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని నోటీసులో పేర్కొన్నారు. ఈ అంశంపై వైసీపీ నాయకుల్లో ఆందోళన కలిగిస్తున్నది.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కందుకూరు, జూన్ 23: కందుకూరు సబ్ కలెక్టరు కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి సబ్ కలెక్టరు పద్మావతి ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్ స్థాయిలోని అన్ని శాఖల అధికారులు తగిన సమాచారంతో ఈ కార్యక్రమానికి హాజరుకావాలని పేర్కొన్నారు. డివిజన్‌లోని అన్ని ప్రాంతాల ప్రజలు తమ సమస్యలను ఈ వేదికలో తెలియజేయవచ్చునని తెలిపారు. అలాగే కందుకూరు మండల స్థాయిలో తహసీల్దారు కార్యాలయంలోనూ ఈ కార్యక్రమం జరుగుతుందని మండలస్థాయి అధికారులంతా అక్కడ హాజరుకావాలని ఆమె తెలిపారు.

గంజాయి నిరోధానికి ప్రత్యేక చర్యలు

- రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత

కావలి, జూన్ 23 : రాష్ట్రంలో గంజాయి నిరోధానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఆమె తిరుమల నుంచి విజయవాడ వెళుతూ ఆదివారం సాయంత్రం మార్గమధ్యంలోని కావలిలో పోలీస్ కమాండ్ కంట్రోల్ రూములో కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నారు. ఈ సందర్భంగా కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆమెను కలిసి పుష్పగుచ్చం అందచేశారు. కావలి కేంద్రంగా గంజాయి ఇతర రాష్ట్రాలకు తరలిపోతుందని, దానివలన ఇక్కడ యువత పెడదారి పడుతున్నారని, దానిపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. దీనిపై స్పందించిన మంత్రి వెంటనే అక్కడ ఉన్న పోలీస్ అధికారులతో దానిపై నిఘా పెట్టి నిరోధానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చుదిద్దుతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



హోం మంత్రి అనితతో కావలి ఎమ్మెల్యే కావ్య, టీడీపీ నేతలు

వంట గ్యాస్ సిలిండర్‌కు కాలపరిమితి!

- గడువు దాటితే ముప్పు తప్పదు
- గ్యాస్ వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలని అధికారుల సూచన

సీతారామపురం, జూన్ 23: గ్యాస్ సిలిండర్‌తో వంట చేసుకోవడం ఎంత సులభమైన పద్ధతినో సరైన జాగ్రత్తలు పాటించకపోతే అంతే ప్రమాదం కూడా ఉంటుంది. సిలిండరు కాలపరిమితి ఉంటుందని, దాన్ని గమనిస్తూ ఉండాలని నిపుణులు చెబుతున్నారు. గడువు తేదీ ముగిసిన సిలిండరును వినియోగిస్తే గ్యాస్ లీకయ్యే ప్రమాదం ఉంది. వంట గ్యాస్ కంపెనీలు సరఫరా చేసే ప్రతి సిలిండర్‌పై గడువు తేదీ కోడ్ విధానంలో మెటల్ ప్లేట్‌పై ముద్రిస్తాయి. సిలిండరును బుకింగ్ చేసుకుని మార్చే ప్రతిసారి ఆ గడువు తేదీని చూసుకుని వినియోగించాలి.



సిలెండర్‌పై కోడ్ విధానంలో ఉన్న గడువు తేదీలు బీ-24, బీ- 25

సిలెండర్‌పై గడువు తేదీని ఇలా గుర్తించాలి..

సిలిండర్ మెటల్ ప్లేట్‌పై ఏ-24, బీ-24 అని ఉంటే ఆ సిలిండర్ 2024 మార్చికి ఆ సిలిండర్ గడువు ముగుస్తుందని అర్థం. 24 అంటె 2024 సంవత్సరానికి, ఆంగ్ల అక్షరం త్రైమాసికానికి సూచిక. ఏ అక్షరం జనవరి నుండి మార్చి వరకు, బీ అక్షరం ఏప్రిల్ నుంచి జూన్ వరకూ, సీ అక్షరం జూలై నుంచి సెప్టెంబరు వరకూ, డి అక్షరం అక్టోబరు నుంచి డిసెంబరు వరకూ అని గుర్తించాల్సి ఉంటుంది.

ఎట్టి పరిస్థితుల్లో తీసుకోవద్దు..

సిలిండర్ ఇంటి వద్దకు వచ్చిన వెంటనే మెటల్ ప్లేట్‌పై కోడ్ విధానంలో ఉన్న గడువు తేదీని, గడువు తేదీ నెల వ్యవధిలో ముగుస్తున్నట్లు సిలిండర్‌పై ఉంటే దాన్ని తీసుకోకూడదు. ఎందుకంటే చిన్న కుటుంబాల వారికి నెల రోజులకు పైగా గ్యాస్ వస్తుంది. ఆ సిలిండర్ స్థానంలో వేరే సిలిండరు అడిగి తీసుకునే హక్కు వినియోదారుడికి ఉంది.

సిలిండరుకు పదేళ్ల గడువు..

సిలిండర్ తయారైనప్పటి నుంచి పదేళ్ల వరకు గడువు ఉంటుంది. సిలిండర్‌ను ప్రత్యేకమైన ఉక్కుతో సిలిండర్ లోపల సురక్షితమైన కోటింగ్‌తో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) ప్రమాణాల మేరకు తయారు చేస్తారు. బీఐఎస్ అనుమతులు తీసుకున్న సిలిండర్‌పై కోడ్ విధానంలో ఉన్న తరువాతే సిలిండర్ మార్కెట్లోకి వస్తుంది.

‘సోమశిల’కు మంచిరోజులే !

- ఆగిన పనులపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి
- హైలెవల్, ఆఫ్రాన్ పనుల పూర్తికి చర్యలు?
- రైతుల్లో హర్షాతిరేకాలు

అనంతసాగరం, జూన్ 23 : సోమశిల జలాశయానికి మంచి రోజులు రానున్నాయి. ఆగిన హైలెవల్, ఆఫ్రాన్ పనులతోపాటు అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. గత వైసీపీ ప్రభు త్వం సోమశిలను చిన్నచూపు చూసింది. చేపట్టాల్సిన అభివృద్ధి పనులను విస్మరించింది. డ్యాం అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించకపోవడంతో జలాశయం మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. అత్యవసర పనులపైనా గత పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రైతుల్లోనూ ఆగ్రహం పెల్లుబికింది. సమయం కోసం ఎదురు చూసి ఓటు అనే ఆయుధంతో తగిన గుణపాఠం చెప్పారు. ఈ క్రమంలో అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ కూటమిపై రైతుల్లో ఆశలు చిగురించాయి.

అసంపూర్తిగా పనులు

గత రెండేళ్ల కాలంలో ఎగువ నుంచి జలాశయానికి వచ్చిన భారీ వరదలతో సోమశిల అతలాకుతలమైంది. 12 గేట్లు ఎత్తి దిగువకు నీరు వదలడంతో డ్యాం ముందున్న కట్టడాలు ధ్వంసమయ్యాయి.



సోమశిల డ్యాం వద్ద ఆగిన అభివృద్ధి పనులు

ప్రొటెక్షన్ వాల్ పూర్తిగా కొట్టుకుపోగా, ఆఫ్రాన్ ప్రాంతంలోని కాంక్రీట్ నిర్మాణమంతా లేచిపోయి పెద్దఎత్తున గోతులు ఏర్పడ్డాయి. ఈ కారణంగా ప్రాజెక్టు మనగడ ప్రశ్నార్థకమైంది. ఈపనులన్నీ అత్యవసరంగా చేసి జలాశయ పటిష్ఠతకు ఇబ్బంది లేకుండా చూడాల్సి ఉంది. కానీ వైసీపీ ప్రభుత్వం శ్రద్ధ చూపలేదు. డ్యాం పరిస్థితి ప్రమాదభరితంగా మారినా.. జగన్ సర్కార్‌లో చలనంలేదు. ఇక మెట్ట ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించే స్కీం ఆనం సంజీవరెడ్డి హైలెవల్ కెనాల్. దీని నిర్మాణం 2013లో ప్రారంభమైంది. రూ 1,560 కోట్లతో ప్రతిపాదించి విడతల వారీగా ప్రాజెక్టును పూర్తిచేసి ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల్లో నీటిఎద్దడి తీర్చాలని భావించి పనులకు శ్రీకారం చుట్టారు. అయితే నేటికి 50 శాతం పనులు కూడా కాలేదు. సోమశిల నుంచి మొత్తం 5 టీఎంసీల జలాలు తరలించి ఐదు మినీ రిజర్వాయర్లకు సరఫరా చేసి 50 వేల ఎకరాలకు సాగు, లక్షమందికి తాగునీరు అందించేలా పనుల రూపకల్పన చేశారు. ఆదిశగా 2014లో టీడీపీ ప్రభుత్వం నిధులు కే టాయించి పనులు జరిగేలా చర్యలు చేపట్టింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ రీటెండరింగ్ పేరిట పనులు కాలయాపన చేసింది. ఇక రిజర్వాయర్లు నిర్మించే ప్రాంతాల్లో ఇంత వరకు భూసేకరణకు సంబంధించి బాధిత రైతులకు పరిహారం ఇవ్వలేదు. పనుల ఊసేలేక బోర్లలో నీటిమట్టాలు తగ్గి అనంతసాగరం, ఆత్మకూరు, మర్రిపాడు, వింజమూరు, దుత్తలూరు, వరికుంటపాడు, ఉదయగిరి ప్రాంత రైతులు నీటి ఇబ్బందులతో అల్లాడుతున్నారు.

ప్రాజెక్టులకు పెద్దపీట

ప్రస్తుతం అధికారంలో వచ్చిన టీడీపీ సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యత ఇవ్వనుంది. గత పరిపాలనకు నేటి పాలనకు భిన్నత్వం ఉండాలని సీఎం చంద్రబాబు ఇటీవల మంత్రులకు దిశానిర్దేశం చేశారు. దీంతో ఈసారి సోమశిల జలాశయం సమగ్రాభివృద్ధి చెందుతుందని అన్నదాతలు ఆశిస్తున్నారు. సోమశిల డ్యాం ప్రాధాన్యత, పూర్తిస్థాయి అవగాహన కలిగిన మంత్రి ఆనం నేతృత్వంలో సోమశిలను అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని రైతులు భావిస్తున్నారు.



చికిత్స పొందుతున్న బాలుడితో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

‘డయేరియా’ చిన్నారులు కోలుకునే వరకు వైద్యం

- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (వైద్యం) జూన్ 23 : డయేరియా వ్యాధికి గురైన చిన్నారులు పూర్తిగా కోలుకునే వారికి అవసరమైన వైద్య చికిత్సలు అందించాలని కలెక్టర్ హరినారాయణన్ వైద్యాధికారులను ఆదేశించారు. ఆదివారం నెల్లూరులోని జైబారత్ ఆసుపత్రిలో డయేరియాకు చికిత్స పొందుతున్న చెన్నూరుకు చెందిన గిరిజన వసతిగృహం చిన్నారులు ఆరుగురిని కలెక్టర్ పరామర్శించారు. వారికి అందుతున్న వైద్య చికిత్సలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆ చిన్నారుల ఆరోగ్యం మెరుగుపడటంపై సంతృప్తి వ్యక్తం చేశారు. వారి ఆరోగ్యం కుదుట పడే వరకు డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య, ఐటీడీఏ పీవో మందా రాణి పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గూడూరు ట్రైబుల్ వెల్ఫేర్ అధికారి బేబీ రాణి, వైద్యులు సీవీ సుబ్రహ్మణ్యం, వెన్నెల, ఆసుపత్రి డిప్యూటీ మేనేజర్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

పరిష్కారం కాని క్లెయిమ్‌లు

- చంద్రన్న బీమాపై గత ప్రభుత్వం కక్ష
- లబ్ధి పొందలేక బాధితుల అగచాట్లు
- కొత్త ప్రభుత్వంపై గంపెడాశలు

నెల్లూరు(హరనాథపురం), జూన్ 23: టీడీపీ హయాంలో ప్రవేశపెట్టిన చంద్రన్న బీమా పథకంపై కూడా గత వైసీపీ ప్రభుత్వం కక్షసాధింపునకు పూనుకుంది. ఇంటి దీపాన్ని కోల్పోయి ఇక్కట్లు పడుతున్న కుటుంబాలకు ఈ పథకం ఎంతో ఆసరాగా ఉండేది. కుటుంబ యజమాని రోడ్డు ప్రమాదంలో మరణించినా, విద్యుదాఘాతం, సహజంగానూ, పాముకాటు కారణాలతో మృతి చెందినా ఈ పథకం ద్వారా బీమా లబ్ధి చేకూరేది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వందలాది మందికి బీమా మొత్తాన్ని చెల్లించకుండా అడ్డుకుంది. 2019 మార్చి వరకు చంద్రన్న బీమా పథకం కింద ఉన్న పెండింగ్ క్లెయిమ్‌లను వైసీపీ ప్రభుత్వం పక్కన పెట్టింది. ఈ క్లెయిమ్‌లన్నీ దాదాపుగా డెత్ క్లయిమ్‌లే.

పేరు మార్చి..

వైసీపీ ప్రభుత్వం చంద్రన్న బీమా పేరును వైఎస్ఆర్ బీమాగా మార్చింది. ఆనాడు చంద్రన్న బీమా ద్వారా 70 ఏళ్ల లోపు వారు ప్రమాదంలో చనిపోతే రూ.5 లక్షలు, 59 ఏళ్ల లోపు సహజమరణానికి రూ2 లక్షల వంతున పరిహారం అందచేసే వారు. బీమా చేసి మృతి చెందిన వ్యక్తి ఇంటికి వెళ్లి రూ. 5వేల అంత్యక్రియల ఖర్చులను కూడా బీమామిత్ర ద్వారా చెల్లించారు. అంతేకాక 30 రోజుల లోపే చంద్రన్నబీమా క్లెయిమ్‌లు పరిష్కారం అయ్యేవి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత బీమామిత్రలను తొలగించి వైసీపీ వారిని నియమించారు. కొంతకాలం తరువాత సచివాలయాల ఏర్పాటు జరిగింది. సచివాలయ సంక్షేమశాఖ అసిస్టెంట్ల ద్వారా ఈ పథకాన్ని అమలు చేసింది. వైసీపీ ప్రభుత్వంలో బీమా లబ్ధిదారులకు టీడీపీ ప్రభుత్వంలో మాదిగా కాకుండా రూ. లక్ష మాత్రమే సహజమరణానికి ఇచ్చేవారు. అది కూడా ఎన్నిరోజులకు అందుతుందో చెప్పలేని పరిస్థితి. వైఎస్ఆర్ బీమా క్లెయిములైనా పరిష్కారమవుతాయా అనుకుంటే అవికూడా 400కు పైబడి పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం.



డీఆర్‌డీఏ కార్యాలయం

1450 క్లెయిమ్‌ల పెండింగ్

చంద్రన్న బీమా పథకం కింద 2019 మార్చి నాటికి 1450 క్లెయిమ్‌లు పరిష్కారం కాకుండా మిగిలిపోయాయి. పథకం పేరు మార్చిన వైసీపీ ప్రభుత్వం ఆ క్లెయిమ్ పరిష్కారాన్ని పట్టించుకోలేదు. టీడీపీ హయాంలో కుటుంబ యజమానిని కోల్పోయినప్పటికీ బీమా ద్వారా వచ్చే నగదుతో ఎంతో మంది పాడిపశువుల పెంపకం, దుస్తుల వ్యాపారం, చిరువ్యాపారాలు చేసుకుంటూ తమ కుటుంబాలను పోషించుకునేవారు. ఆధారం కోల్పోయిన పేదల కుటుంబాలకు చంద్రన్న బీమా పథకం ధీమా కల్పించేది. తాజాగా ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో చంద్రన్న బీమా క్లెయిమ్‌దారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. బీమా పరిహారం ఇకనైనా అందుతుందనే భావనలో వారున్నారు.

సోమిరెడ్డి చొరవతోనే గిరిజనుడికి న్యాయం

- కృతజ్ఞతలు తెలిపిన గిరిజన కుటుంబం

మనుబోలు, జూన్ 23: సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి చొరవతోనే గిరిజనుడికి న్యాయం జరిగిందని టీడీపీ మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి అన్నారు.వెంకటగిరి నియోజకవర్గం సైదాపురం మండలం పోతేగుంట గ్రామానికి చెందిన గిరిజనుడైన చిట్టేటి భానుచందర్ 9ఏళ్లుగా మండలంలోని వీరంపల్లి సబ్‌స్టేషన్‌లో కాంట్రాక్టు బేసిక్ కింద షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. భానుచందర్‌కు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఆపరేటర్ ఉద్యోగంతోనే భార్యాబిడ్డలను, తల్లిదండ్రులను పోషించుకుంటున్నాడు. 2023 అక్టోబర్‌లో ఎలాంటి ఆరోపణలు లేకపోయినా వీరంపల్లి గ్రామ వైసీపీ నాయకుడి మాటలు విని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి భానుచందర్‌ను ఆపరేటర్ ఉద్యోగం నుంచి తప్పించాడు. దీంతో భాను అక్టోబరు 18న కుటుంబంతో సహా నిరాహార దీక్షకు కూర్చుని పదిరోజుల పాటు చేశాడు. ఈ విషయం జిల్లావ్యాప్తంగా దుమారం రేగింది. గిరిజనుడికి అన్యాయం జరిగిందన్న సమాచారాన్ని మండల టీడీపీ నాయకులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్ళగా, ఆయన వెంటనే దీక్షా శిబిరానికి చేరుకుని గిరిజనుడి బాధను విని విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడారు. నాలుగు నెలల్లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, మరలా నీకు ఉద్యోగం ఇప్పించే బాధ్యత నాదేనంటూ భానుచందర్‌కు సోమిరెడ్డి ధైర్యం చెప్పారు. ప్రమాణ స్వీకారం కాగానే ఎమ్మెల్యే సోమిరెడ్డి భానుచందర్ విషయం గుర్తుపెట్టుకుని మరీ ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడి ఎక్కడైతే భానుచందర్‌కు ఉద్యోగం తీసేశారో, అక్కడే ఉద్యోగం ఇవ్వాలని ఆదేశించారు. దీంతో శుక్రవారం మరలా భానుచందర్ ఆపరేటర్‌గా విధుల్లోకి చేరాడు. ఇదే విషయమై ఆదివారం వీరంపల్లి సబ్‌స్టేషన్‌లో టీడీపీ నాయకులు విలేఖర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బడుగు, బలహీన, పేద వర్గాలకు ఎమ్మెల్యే సోమిరెడ్డి అత్యంత ప్రాధాన్యత ఇస్తారన్నారు. 8నెలల క్రితం చెప్పినట్లుగానే గిరిజనుడైన భానుచందర్‌కు వీరంపల్లిలోనే ఉద్యోగం కల్పించిన ఘనత సోమిరెడ్డికే దక్కుతుందన్నారు. పేదలకు చేసిన పాపాలే కాకాణికి శాపాలుగా మారాయన్నారు. అందుకనే డిపాజిట్లు లేకుండా ఓడించారన్నారు. అత్యధిక మెజార్టీతో సోమిరెడ్డి విజయం సాధించారన్నారు. ఈ సందర్భంగా ఆపరేటర్ భానుచందర్ మాట్లాడుతూ 8నెలలు ఉద్యోగం లేకుండా, కూలీపనులు చేసుకుని నరకం అనుభవించామన్నారు. తనను గుర్తుపెట్టుకుని ఉపాధి చూపిన ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని భానుచందర్ కుటుంబం కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పొన్నూరు రామకృష్ణయ్య, గాలి రామకృష్ణారెడ్డి, మధునాయుడు, మస్తాన్‌నాయుడు, పొట్టేళ్ళ ప్రసాద్, యానాదినాయుడు, రఘురామయ్య, లక్ష్మయ్య, రామకృష్ణ, సునీల్, సర్వేపల్లి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బొబ్బేపల్లి సురేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



వీరంపల్లి సబ్‌స్టేషన్ వద్ద కృతజ్ఞతలు తెలుపుతున్న భానుచందర్ కుటుంబం

సోమశిలలో 10.060 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం, జూన్ 23: సోమశిల జలాశయానికి ఎగువ నుంచి ఆదివారం 512 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 10.060 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు కొనసాగుతోంది.

సచివాలయం తాళాలు ఇచ్చిన జమ్మలపాలెం సర్పంచు

జలదంకి, జూన్ 23: జమ్మలపాలెం సచివాలయం తాళాలను ఎట్టకేలకు సర్పంచు బుర్రి శ్రీవేణి పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. ఆ సచివాలయంలో సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలు ఏర్పాటు చేసే విషయంలో నెలకొన్న హైడ్రామాపై ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. ఒక అధికారి కుమార్తెగా, ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడి సతీమణిగా అధికారులపై ఉన్న గౌరవంతోనే వారు అడిగిన వెంటనే సచివాలయం తాళాలు అందజేశానని, ఎవరికో భయపడి ఆపని చేయలేదన్నారు. తాను సర్పంచుగా ఎన్నికైన తరువాత అధికారుల ప్రోత్సాహంతో పంచాయతీకి అవార్డులు తీసుకురావచ్చానన్నారు. గ్రామంలో సచివాలయం నిర్మాణంలో తాను ఎంతో శ్రమించానని పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అగ్నిప్రమాద బాధితులకు
సరుకుల వితరణ



సరుకులు పంపిణీ చేస్తున్న సహృదయ సేవా సమితి సభ్యులు

నెల్లూరు(హరనాథపురం), జూన్ 23 : నగరంలోని బర్మాషెల్ గుంట అగ్నిప్రమాద బాధితులకు ఆదివారం సహృదయ సేవా సమితి అధ్యక్షులు కారుమంచి వెంకటేష్, ఫణికుమార్ ఆధ్వర్యంలో నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి 10 కిలోల బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు అందచేశారు. అనంతరం అన్నదానం చేశారు. వెంకటేష్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు తమ వంతుగా సహాయం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, వరప్రసాద్, రాము, మల్లికార్జున, హజరత్ నాయుడు, వీరయ్య, సుబ్బారావు, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తీర్థవాది ఉత్సవం

- చాముండేశ్వరికి సముద్ర స్నానం

ఇందుకూరుపేట, జూన్ 23 : మండలంలోని గంగపట్నం గ్రామంలో శ్రీచాముండేశ్వరి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం అమ్మవారికి తీర్థవాది ఉత్సవం (సముద్ర స్నానం) ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మ హేచరీస్ అధినేత దుర్గా శంకర్‌రెడ్డి, నరాల సత్తిబాబు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొద్దుకూరు సుధీర్, వెంకటరమణారెడ్డి, జనార్ధన్‌గౌడ్, కర్పూరం భాస్కర్, కార్యనిర్వహణ అధికారి బండి శాంతయ్య, అర్చకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



సముద్ర స్నానం అనంతరం భక్తులకు దర్శనమిచ్చిన చాముండేశ్వరి

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నెల్లూరు(క్రైం), జూన్ 23: నెల్లూరులోని పోలీసు కవాతు మైదానంలో ఉన్న ఉమేష్‌చంద్ర సమావేశ మందిరంలో సోమవారం పోలీసు శాఖ ప్రజాసమస్యల పరిష్కార వేదిక జరుగుతుందని జిల్లా పోలీసు కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రజలు పోలీసు శాఖాపరమైన ఫిర్యాదులు, అర్జీలను జిల్లా ఎస్పీకి అందజేసి పరిష్కరించుకోగలరని తెలిపింది.

టైపిస్టు, స్టెనోగ్రాఫర్ల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

నెల్లూరు (జడ్పీ), జూన్ 23: టైపిస్టు, స్టెనోగ్రాఫర్ల సంఘం జిల్లా కమిటీని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కేవీ రమణయ్య, కార్యదర్శిగా ఎం సురేంద్రబాబు, కోశాధికారిగా ప్రమీల, ఉపాధ్యక్షులుగా రామకృష్ణ, కే సునీల్ కుమార్‌రెడ్డితోపాటు అడిషనల్ సెక్రటరీ, ఆర్గనైజింగ్ సెక్రటరీలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శంకర్‌నాయక్, రాష్ట్ర నాయకులు సురేష్‌బాబు, బ్రహ్మానంద రెడ్డి తదితరులు హాజరయ్యారు.

బైకును ఢీకొన్న లారీ

- భర్త కళ్లెదుటే భార్య దుర్మరణం

నెల్లూరు(క్రైం), జూన్ 23: కుమార్తెను చూసేందుకు వెళుతున్న దంపతుల్లో భార్యను మృత్యువు లారీ రూపంలో కబళించింది. పోలీసుల సమాచారం మేరకు... విడవలూరు మండలం ముదివర్తి గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ, సరోజనమ్మ(48) దంపతుల కుమార్తె హారిక నెల్లూరులోని రామ్మూర్తినగర్‌లో నివసిస్తోంది. కుమార్తెను చూసేందుకు ఆదివారం ఉదయం లక్ష్మీనారాయణ దంపతులు బైక్‌పై బయలుదేరారు. జాతీయ రహదారిపై నగరంలోని ఎన్‌టీఆర్ నగర్ కూడలి వద్దకు వచ్చే సరికి కావలి వైపు నుంచి చెన్నై వైపు వెళుతున్న లారీ వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొంది. దీంతో రోడ్డుపై పడ్డ సరోజనమ్మకు తీవ్రగాయాలయ్యాయి. బోరున ఏడుస్తూ భర్త ఎంత ప్రయత్నించినా ఆమెలో చలనం రాలేదు. అప్పటికే ఆమె మృతి చెందిందని స్థానికులు తెలిపారు. లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ ఎస్ఐ గీతారమ్య ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. గాయాలపాలైన లక్ష్మీనారాయణను కూడా వైద్యశాలకు తరలించారు. కాగా, వాహనం నడుపుతున్న లక్ష్మీనారాయణ హెల్మెట్ ధరించడం వల్ల గాయాలతో బయటపడినట్లు స్థానికులు చెబుతున్నారు.



భార్య మృతదేహం వద్ద కన్నీరుమున్నీరవుతున్న భర్త

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	150
లేయర్ లైవ్	120
స్కిన్ చికెన్	264
స్కిన్‌లెస్	294
లేయర్	204

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6824
వెండి కిలో ధర	రూ. 91,300
వెండి ఒక గ్రాము	రూ. 93.30

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, జూన్ 23: మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. ముందుగా గాంధీ ఆశ్రమ కమిటీ సభ్యురాలు గంపల మంజుల మహాత్మా గాంధీ, పొనక కనకమ్మల విగ్రహాలకు నూలుమాలలు, ఖాదీ వస్త్రాలు సమర్పించారు. అనంతరం స్కూల్ విద్యార్థులకు మహాత్మాగాంధీ జీవిత విశేషాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ మనోజ్, స్కూల్ విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



పరిహారం కోసం ఎదురుచూపులు

- ప్రారంభించిన రెండు నెలలకే ఆగిన వైఎస్సార్ పశుబీమా
- పెండింగ్‌లో రూ.8.64 కోట్ల క్లెయిమ్‌లు
- పాత విధానంలోనే ఇవ్వాలంటున్న పశుపోషకులు
- కొత్త ప్రభుత్వంపైనే ఆశలు

నెల్లూరు(వ్యవసాయం), జూన్ 23: గత వైసీపీ ప్రభుత్వం పాడిరైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉన్న పాత పథకాలను నిలిపేసి, వైఎస్ఆర్ పేరుతో కొత్త పథకాలు అమల్లోకి తీసుకువచ్చింది. అయితే వాటివల్ల పాడిరైతులకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు. డెత్ క్లెయిమ్‌లు ఎక్కువగా వచ్చాయంటూ వైఎస్ఆర్ పశునష్ట పరిహార పథకాన్ని నిలిపేసింది. దీంతో జిల్లాలో సుమారుగా రూ.8.64కోట్ల విలువైన డెత్ క్లెయిమ్‌లు విడుదల కాకుండా నిలిచిపోయాయి. అంతేకాక వైఎస్ఆర్ పశుబీమా పథకం ప్రారంభించి, రెండు నెలలు గడవకముందే అటకెక్కింది. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాడిరైతుల్లో ఆనందం నెలకొంది. పాత పథకాలు తిరిగి పురుడు పోసుకుంటాయని, సుమారు మూడేళ్లుగా ఎదురు చూస్తున్న డెత్ క్లెయిమ్‌లపై మంచి నిర్ణయం తీసుకుంటారని పాడిరైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అందని పరిహారం

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పశువులు చనిపోతే, వాటిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులు నష్టపోకుండా ఉండాలనే ఉద్దేశంతో ఎంతో సులభంగా పరిహారం అందించేవారు. పశువైద్యాధికారి పశువును పరిశీలించి, ధ్రువీ కరిస్తే రైతులకు పరిహారం అందేది. 2019లో వైసీపీ ప్రభుత్వం వైఎస్ఆర్ పశు నష్టపరిహార పథకాన్ని అమలులోకి తెచ్చింది. పాడిరైతులు ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా ప్రభుత్వమే ఆ భారాన్ని భరిస్తుందని మార్గదర్శకాల్లో పేర్కొంది. చనిపోయిన పశువులకు పశువైద్యాధికారి పోస్టుమార్టం చేసి, రెవెన్యూ అధికారుల సహకారంతో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తే పరిహారం అందేలా మార్గదర్శకాలు రూపొందించింది. ఈ క్రమంలో పశువు ప్రమాదవశాత్తు మృతిచెందితే సుమా రుగా రూ.30వేలు, మేక, గొర్రె చనిపోతే రూ.6 వేల వరకు పరిహారం నేరుగా రైతుల ఖాతాల్లో జమయ్యేది. అయితే పరిహారం చెల్లింపుల్లో తీవ్రజాప్యం చోటు చేసుకోవడంతోపాటు డెత్ క్లెయిమ్‌లు అధికంగా రావడంతో వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని నిలిపేసింది. ఈపథకం ద్వారా జిల్లాలో 3,898 పశువుల యజమానులకు రూ.8,64,81,000 పరిహారం అందాల్సి ఉంది. మూడేళ్లుగా వారు ఎదురుచూస్తున్నా నేటికీ అందలేదు.



రెండు నెలలకే ఆగిన వైనం

వైఎస్ఆర్ పశు నష్టపరిహారం పథకాన్ని రద్దు చేసిన వైసీపీ ప్రభుత్వం నాలుగైదు నెలలకే వైఎస్ఆర్ పశుబీమా పథకాన్ని తీసుకొచ్చింది. పథకం ప్రారంభంలో ప్రభుత్వం జిల్లాల వారీగా లక్ష్యాలను కేటాయించింది. దీంతో అధికారులు పాడిరైతులతో మాట్లాడి బీమా చేయించారు. జిల్లాలో 6,46,088 నల్లపశువులు, 57,774 తెల్లపశువులు, 1,09,5197 గొర్రెలు, 3,86,929 మేకలు, 2969 పందులు ఉండగా దాదాపుగా 3789 పశువులు, 12159 మేకలు, గొర్రెలు, ఓ పందికి బీమా ప్రీమియం చెల్లింపులు జరిగాయి. అయితే ఈపథకానికి బడ్జెట్ కేటాయింపు లేక పరిహారం చెల్లింపులు నిలిచిపోయాయి. దీంతో పథకం ప్రారంభించి రెండు నెలలు కూడా పూర్తవకముందే అటకెక్కింది.

కొత్త ప్రభుత్వంపై ఆశలు

కొత్త ప్రభుత్వంపైనే రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. పాత పథకాలు పునఃప్రారంభం అవుతా యని వారు భావిస్తున్నారు. పశువులకు గడ్డి కొరత లేకుండా ఉండేందుకు పశుగ్రాస క్షేత్రాలు, రాయితీపై మంచి పోషక విలువలున్న దాణా అందుతుందని, అలాగే నిలిచిపోయిన డెత్ క్లెయిమ్‌లు పరిష్కారమవుతాయని ఆశిస్తున్నారు. వారి ఆశలు ఎంతవరకు ఫలిస్తాయో చూడాలి.

తీరనున్న పేదవాడి ఆకలి

- అన్న క్యాంటీన్ల పునరుద్ధరణపై హర్షం
- వసతుల మెరుగునకు

రూ.10.8లక్షలతో ప్రతిపాదనలు

ఆత్మకూరు, జూన్ 23: అన్న క్యాంటీన్లను పునరుద్ధరిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సంతకం చేయగా.. క్షేత్రస్థాయిలో అధికారులు చర్యలకు వడివడిగా అడుగులు వేస్తున్నారు. వైసీపీ అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్లకు మంగళం పాడింది. అన్న క్యాంటీన్ల భవనాల రూపురేఖలు మారాయి. భవనాలకు రంగులు మార్చి కొన్నింటిని సచివాలయాల కింద మార్చి వేశారు. ప్రస్తుతం వాటి పునరుద్ధరణకు అవసరమైన నిధులు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వాటిని సుందరంగా తీర్చిదిద్ది పేదల ఆకలి తీర్చేందుకు సిద్ధం చేస్తుండటంతో నియోజకవర్గ పేదలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ఆత్మకూరులో ముస్తాబవుతున్న అన్న క్యాంటీన్

వసతుల మెరుగునకు రూ.10.8 లక్షలతో ప్రతిపాదనలు

ఆత్మకూరు పట్టణంలోని పాత గవర్నమెంట్ హాస్పిటల్ ముందు గతంలో నిర్మించిన అన్న క్యాంటీన్ భవనాన్ని వాడుకలోకి తెచ్చేందుకు అధికారులు రూ.10.8లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. కుర్చీలు, రంగులు తదితర సౌకర్యాలతో వినియోగంలోకి తెచ్చేందుకు పనులు మొదలు పెట్టి రంగులు వేయించారు. ప్రభుత్వం నిర్దేశించిన తేదీకి దానిని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్లకు ఉన్న రంగులు మార్చేందుకు వేలాది రూపాయలు ఖర్చు చేశారు. పోనీ రంగులు మరిస్తే- మార్చారు. వాటిని కొనసాగించి పేదలకు అన్నం పెట్టారా.. అంటే అదీ లేదు. రంగులకు పెట్టిన సొమ్ము తో అయిదేళ్ల పాటు మా కడుపు నింపేవారని పేదలు వైసీపీ ప్రభుత్వ తీరుపై దుమ్మెత్తి పోస్తున్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయంగా..

తెలుగుదేశం ప్రతి ఒక్కరికీ కూడు, గుడ్డ, నీడ కల్పించడమే ధ్యేయంగా పలు పథకాలను అమలు చేసింది. అతితక్కువ ధరకే రుచికరమైన భోజనం అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో పట్టణ నడిబొడ్డున ఉన్న మున్సిపల్ బస్టాండ్ సమీపంలో పాత ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో అన్న కాంటీన్‌ను ఏర్పాటు చేశారు. వివిధ పనులపై వచ్చే వారు, పనిచేసే కార్మికులు, నిరుపేదలు ఆకలితో అమటించకుండా అన్న క్యాంటీన్‌కు వెళ్లి వారి కడుపు నిండా భోజనం చేసేవారు. ప్రతిరోజూ రెండు వేలమందికి పైగా మూడుపూటలా భోజనం చేసేవారు. నిర్విరామంగా నిరుపేదల కడుపు నింపుతున్న అన్నక్యాంటీన్లు అన్నివర్గాల మన్ననలను పొందింది. ఆసుపత్రులకు వచ్చే వారు, శ్రామికులు, నిరుపేదలు, చిన్న పనులు చేసుకునే వారితో పాటుగా వివిధ ప్రాంతాల నుంచి పోటీ పరీక్షలకు కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులకు అన్న క్యాంటీను సౌకర్యవంతంగా మారింది. ఈ రోజుల్లో ఎక్కడ భోజనం చేయాలన్నా కనీసం రూ.50 నుంచి రూ.60ల వరకు ఖర్చవుతుంది. అయితే అన్న క్యాంటీన్‌లో రూ.5లకే భోజనం పేదలకు అందుబాటులోకి తెచ్చిన ఘనత చంద్ర బాబుకే దక్కుతుందని చెబుతున్నారు.

అన్నారెడ్డిపాళెంలో వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు బిందుమీనన్

సంగం, జూన్ 23: అన్నారెడ్డిపాళెంలో నెల్లూరు బిందు మీనన్ ఫౌండేషన్ సభ్యులు ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ నిర్వాహకురాలు ప్రముఖ న్యూరాలజిస్ట్ బిందు మీనన్ రోగులను పరీక్షించారు. అనంతరం పక్షవాత, మూర్ఛవ్యాధిపై అవగాహన కల్పించారు.

నాగవరపమ్మకు ప్రత్యేక పూజలు

సంగం, జూన్ 23: కోలగట్ల సమీపంలోని పెన్నానది ఒడ్డున వెలసిన పురాతన నాగవరపమ్మ ఆలయంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగవరపమ్మ మూలవిరాట్‌కు క్షీర, పంచామృతాలతో అభిషేకాలు చేసిపూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

టీడీపీ ఫ్లెక్సీ చించివేత

అనంతసాగరం, జూన్ 23: మండలంలోని వరికుంటపాడులో టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని కొందరు చింపేశారు. ఈ విషయంపై స్థానిక నేతలు పోలీసు స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ సూర్యప్రకాష్‌రెడ్డి గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టారు.

ఆలయ కమిటీ ఎన్నిక



ఉదయగిరి, జూన్ 23: గన్నేపల్లి పంచాయతీలోని శీఅడవిపేరంటాలమ్మ దేవస్థానం నూతన కమిటీని ఆదివారం ఎన్నికున్నారు. ఆలయ చైర్మన్‌గా పులిగుండ్ల రవీంద్ర, ఇతర కమిటీ సభ్యులను ఉన్నారు.

'అండగా ఉంటా'

ఉదయగిరి రూరల్, జూన్ 23: ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ఎవరూ అధైర్యపడవద్దని, ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మర్రిపాడు మండలంలోని బ్రాహ్మణపల్లిలోని తన నివాసంలో నియోజకవర్గస్థాయి నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. నాయకులంతా సమష్టిగా ఉంటూ పార్టీని బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు మోడి రామాంజనేయులు యాదవ్, గణపం బాలకృష్ణారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్, ఎంపీపీ షేక్ అలీఅహ్మద్, చేజర్ల సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఉదయగిరి రూరల్, జూన్ 23: స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆదివారం నాయకులు, కార్యకర్తలు జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా దేశం కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు నెల్లూరు వెంకట స్వామినాయుడు, ఆవుల రోశయ్య, షాజహాన్, జీ.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కొలువుల మహోత్సవం



వరికుంటపాడు: గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

వరికుంటపాడు, జూన్ 20: గువ్వాడిలో రెండురోజుల నుంచి నిర్వహిస్తున్న లక్ష్మి చెన్నకేశవ స్వామి కొలువుల మహోత్సవం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. దారిపొడవునా మహిళలు వారుకడవలతో నీరు పోసి కాయాకర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పోతురాజుస్వామి భోనం, చాపకుల్లా బంతి, దీవెన బండారు కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా కోటేశ్వరస్వామి కల్యాణం



సంగం: కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

సంగం, జూన్ 23: దువ్వూరు గంగా పార్వతీ సమేత కోటేశ్వరస్వామి ఉదయం కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిఅమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి కల్యాణ వేదిక మీదకు చేర్చారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చరణలతో ఈ వేడుక జరిగింది. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



గ్రామోత్సవంలో స్వామివారు

ముగిసిన సీతారాముల ఉత్సవాలు

ఉదయగిరి రూరల్: కొండాయపాళెం పంచాయతీ పరిధిలోని గంగిరెడ్డిపల్లిలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న కోదండరామస్వామి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు గ్రామోత్సవం, పారువేట, వసంతోత్సవ వేడుకలను భక్తులు నిర్వహించారు. అలాగే అనంతపూరిగంగాభవాని ఉత్సవాలు నిలుపు కార్యక్రమంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ప్రత్యేక వాహనంలో అమ్మవారిని ప్రతిష్ఠించి గ్రామోత్సవం నిర్వహించారు.

పంపింగ్ స్కీం పైప్‌లైన్ల తనిఖీ



బెస్తకాలనీలో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్

సీతారామపురం, జూన్ 23: స్థానిక గ్రామ పంచాయతీలోని డైరెక్ట్ పంపింగ్ స్కీంల పైప్‌లైన్లను ఆదివారం ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, ఈఓపీఆర్డీ సన్నపురెడ్డి భార్గవితో కలిసి తనిఖీ చేశారు. అనంతరం బెస్త కాలనీ, తోటకాలనీ, రజక కాలనీ, కోట వీధి, పడమటి వీధుల్లో నీటి సరఫరాకు ఏర్పాటు చేసిన పైప్‌లైన్లను పరిశీలించారు. లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని అధికారులకు సూచించారు. వర్షాకాలం కావడంతో ప్రజలు తాగు నీటిని వేడి చేసి వడగట్టి తాగాలని, ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకొని మురుగునీరు వీధుల్లోకి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

వెంగమాంబ సన్నిధిలో కాకర్ల కుటుంబం



మాజీ చైర్మన్ కరుణాకర్‌బాబుతో కాకర్ల కుటుంబ సభ్యులు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూన్ 23: నర్రవాడ వెంగమాంబ పేరంటాలమ్మ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సోదరుడు కాకర్ల వెంకట్, రుక్మిణి, ఎమ్మెల్యే కార్యాలయ మేనేజర్ మాలేపాటి చైతన్య, పద్మజ దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సన్నిధిలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై మాజీ చైర్మన్ పచ్చవ కరుణా కర్‌బాబు, ఆలయ కార్య నిర్వహణాధికారి వెట్టిగుంట ఉషశ్రీలతో చర్చించారు. వారివెంట మల్లంపాటి గురవయ్య నాయుడు, శ్రీకుర్తి రవీంద్రబాబు, నాగిరెడ్డి, చీదర్ల మల్లికార్జున ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కలువాయి, జూన్ 23 : మండలకేంద్రంతో పాటు చింతలాత్మకూరు, కుల్లూరు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో సోమవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు డిస్కం గూడూరు ఏడీ రవికుమార్ తెలిపారు. మూడు సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ లైన్ల వెంబడి చెట్టుకొమ్మలు తొలగిస్తున్నట్లు ఆయన వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థినికి ఆర్థికసాయం

ఉదయగిరి రూరల్: గండిపాళెం మేడిద రమేష్ కుమార్తె నిఖిత ఇంటర్ చదువుకు గ్రామానికి చెందిన జీఎంకే ట్రస్టు అధినేత, మండల ఉపాధ్యక్షుడు గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి రూ.20వేలను ఆదివారం తన ప్రతినిధుల కుటుంబసభ్యులకు అందజేశారు. నిఖిత ఫీజుల చెల్లింపు విషయమై తల్లిదండ్రులు ట్రస్టు దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించినట్లు వారు చెప్పారు. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధి వెంకటేశ్వర్లు, గ్రామస్థులు కిరణ్, వెంకటయ్య పాల్గొన్నారు.



ఆలయంలో నిర్వహించిన హోమం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): నర్రవాడ వెంగమాంబ బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. దూరప్రాంతాల నుంచి భక్తులు అధికంగా తరలివచ్చారు. క్యూ లైన్లలో గంటల తరబడి నిరీక్షించి అమ్మవారిని దర్శించుకున్నారు.



విద్యుత్ దీపాలంకరణలో వెంగమాంబ ఆలయం



అమ్మవారి సన్నిధిలో పొంగళ్లు పెడుతున్న మహిళలు



వెంగమాంబ దర్శనానికి బారులు తీరిన భక్తులు

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం!

- పూడిక తీయకపోవడంతో రోడ్లపైకి చేరుతున్న మురుగు
- అవస్థల్లో కావలి పట్టణ ప్రజలు
- పట్టించుకోని అధికారులు



సినిమా హాలు రోడ్డులో నిలిచిన మురుగు నీరు

కావలి, జూన్ 23: కావలి పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. కాలువలు సక్రమంగా నిర్మాణం లేకపోవడం, ఉన్న కాలువలలో పూడిక తీయకపోవడంతో మురుగు నీరు రోడ్లపైన పారి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో అవస్థలు పడుతున్న ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. కావలి మున్సిపాల్టీలో జీతాలు తీసుకునే సిబ్బంది ఎక్కువగా ఉన్నా పనులు చేసే వారు చాలా తక్కువగా ఉన్నారు. దీంతో డ్రైనేజీలలో పూడికతీత సకాలంలో తీయకపోవడం, అనేక చోట్ల కాలువలపై ఉన్న మూత బండలు పూడికతీతకు ఆటంకంగా ఉండడంతో కార్మికులు పూడిక సక్రమంగా తీయడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. దీని వల్ల కాలువలు పొంగి మురుగు రోడ్లపైన పారుతోంది. దీనిపై ఏ ప్రాంతంలోనైనా ప్రజలు ఫిర్యాదులు చేస్తే అక్కడ కాలువల్లో పూడికతీస్తున్నారు. ఈక్రమంలో అనేక చోట్ల రోడ్లపై మురుగు నీరు పారి అపరిశుభ్రంగా తయారవడమేకాక దాని వలన రోగాలు వచ్చే ప్రమాదాలు పొంచి ఉన్నాయి. పట్టణంలోని సినిమాహాల్ రోడ్డు నుంచి వడ్డిపాలెం వెళ్లే రోడ్డులో డ్రైనేజీ నిండి ఆ నీరంతా రోడ్డుపై చేరి దుర్గంధం వెదజల్లుతోంది. బాలక్రిష్ణారెడ్డి నగర్‌లో వినాయకగుడికి వెళ్లే మార్గంలో డ్రైనేజీ నిండి నీరు రోడ్డుపైకి చేరుతుండటంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పాతూరులో కూడా అనేక చోట్ల డ్రైనేజీ నీరు రోడ్లపైకి వచ్చి అక్కడ పందులు చేరి అపరిశుభ్రంగా తయారవుతోంది. ఇలా పట్టణంలో అనేక చోట్ల డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైనా అధికారులు దానిపై తగిన శ్రద్ధ చేపట్టడంలేదనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలువల్లో పూడిక తీయించి రోడ్లపైకి నీరు రాకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



వడ్డిపాలెం వెళ్లే మార్గంలో రోడ్డుపై పారుతున్న నీరు



బీకేనగర్‌లో రోడ్డుపైకి చేరిన మురుగు

కందుకూరులో త్వరలో ప్రజాదర్బార్

- 6 నెలల్లో మున్సిపల్ ఎన్నికలు
- త్వరలోనే ప్రకాశం జిల్లాలోకి..
- ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు



ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న పూజారులు

కందుకూరు, జూన్ 23: రాష్ట్ర ఐటీశాఖామంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో ఆయన మంగళగిరిలో నిర్వహిస్తున్న తీరుగానే కందుకూరులోనూ త్వరలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రకటించారు. బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సౌజన్య దంపతులను ఆదివారం ఘనంగా సన్మానించారు. పట్టణంలోని పోస్టాఫీసు సెంటర్ నుంచి మేళతాళాలతో ఊరేగింపుగా జనార్ధన స్వామి ఆలయం వరకు పూర్ణకుంభ స్వాగతంతో తీసుకెళ్లి ఆలయంలో ఇంటూరి దంపతులకు ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం జనార్ధన స్వామి ఆలయం నూతన కళ్యాణ మండపంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ కందుకూరు మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టిసారించి అన్ని ప్రాంతాలలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం మున్సిపాలిటీకి పాలకవర్గం ఉండాల్సిన అవసరం ఎంతో ఉందని, 15 ఏళ్లుగా ఇక్కడ కౌన్సిల్ లేనందున అనేక సమస్యలు ఉన్నాయని, 6 నెలల్లో కందుకూరు మున్సిపాలిటీకి ఎన్నికలు జరిగేలా మున్సిపల్ శాఖామంత్రి పొంగూరు నారాయణ సహకారంతో అడ్డంకులు తొలగింపచేస్తానన్నారు. కందుకూరు పట్టణ ప్రజలు ఆందోళనలు చెందేలా చిన్న సంఘటన కూడా కందుకూరులో జరగకుండా ప్రశాంతమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. కందుకూరు నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపే ప్రక్రియ కూడా ఆరు నెలల్లో పూర్తవుతుందని తెలిపారు. గత ఎన్నికల్లో బ్రాహ్మణ సోదరులంతా తనకు ఎంతగానో సహకరించారని, వారందరికీ చేతులెత్తి నమస్కరిస్తున్నానన్నారు. కార్యక్రమంలో గుడ్లూరి వెంకన్నకవి రాసిన సన్మానపత్రాన్ని చదివి సమర్పించారు. మంచిరాజు మురళీమోహన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గాయత్రీ రామకృష్ణ, పెట్లూరి సుబ్బారావు, శ్రీరామగిరి శ్రీరామచంద్రమూర్తి, నందనవనం రామ సుబ్బారావు, ఇప్పగుంట మాధవరావు, నాగరాజారావు, రావులకొల్లు వెంకటేశ్వర్లు(ఆర్‌వీ), పవని నాగేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఇకపై 'ప్రజా ఫిర్యాదుల పరిష్కారం'

ఉలవపాడు, జూన్ 23 : ఇకపై ప్రతి సోమవారం తహసీల్దారు కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని తహసీల్దారు ఏవీపీ చంద్రారెడ్డి ఒక ప్రకటలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి వివిధ శాఖలకు సంబంధించిన బాధితుల అర్జీలు స్వీకరించి పరిష్కారం కొరకు ఆయా శాఖల అధికారులకు పంపి నిర్ణయించిన కాల వ్యవధిలో సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కేన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం



కేన్సర్ బాధితుడికి నగదు అందిస్తున్న ప్రసాదరావు, శానం హరి

కావలిటౌన్, జూన్ 23: పట్టణంలోని తుఫాన్‌నగర్‌కు చెందిన వెంకటశేషయ్య కేన్సర్‌తో బాధపడుతుండగా సంయుక్త సేవాసంస్థ సభ్యులు దాతల నుంచి సేకరించిన రూ.10,000లను ఆదివారం సంస్థ సభ్యులు ప్రసాదరావు, శానం హరిలు బాధితుడి నివాసానికి వెళ్లి అందజేశారు. వారు మాట్లాడుతూ పేదవాడైన వెంకటశేషయ్య రూ.3 లక్షలు అప్పు చేసి ఆపరేషన్ చేయించుకున్నప్పటికీ ఆరోగ్యం కుదుటపడకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. దాతలు ముందుకొచ్చి శేషయ్యకు ఆపన్న హస్తం అందించి ఆదుకోవాలని వారు కోరారు.

బేతనీపేట కాలువల్లో పూడికతీత

బిట్రగుంట, జూన్ 23: బోగోలు పంచాయతీ బేతనీపేటలోని రైల్వే ప్రధాన కాలువలో పూడికతీత, పిచ్చి మొక్కలు తీసే కార్యక్రమానికి ఆదివారం టీడీపీ మండల యువత సభ్యుడు గోచిపాతల సంజయ్ తన సొంత నిధులతో ప్రారంభించారు. కాలువ శిథిలావస్థకు చేరినా రైల్వే, పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో పందులు, దోమలకు నిలయంగా మారి దుర్గంధం వెదజల్లుతుంది. దీంతో రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని శుభ్రపరిచే కార్యక్రమం చేపట్టారు. కావలి ఎమ్మెల్యేగా దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి గెలుపుతో బేతనీపేటలో అభివృద్ధి జరుగుతుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు గంగపట్ల సురేష్, స్థానిక యువత ఎండ్లూరి ఫిలోమెన్, గుంటగాని రాజా, గోసాల శ్యామ్, జయానందం, పులివెందల వినోద్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఉద్యోగుల మెగా రక్తదానం



రక్తదానం చేస్తున్న ఎస్‌బీఐ ఉద్యోగులు

కావలిటౌన్, జూన్ 23: ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ నాయకుడు దివంగత తారకనాథ్ వర్ధంతి సందర్భంగా ఎస్‌బీఐ ఉద్యోగులు ఆదివారం రక్తదానం చేశారు. ఆర్డీవో కార్యాలయం ఎదురుగా ఉన్న బ్రాంచ్‌లో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ ఎన్ శ్రీనివాసరావు, బ్రాంచ్ మేనేజర్ గోర్ల శివకుమార్‌లు ప్రారంభించారు. ముందుగా తారకనాథ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రెడ్‌క్రాస్ రక్తనిధిలో సేవలందిస్తున్న డాక్టర్ రమ్య, నాగమణిలను సత్కరించారు. రెడ్‌క్రాస్ వైద్యాధికారి డాక్టర్ బెజవాడ రవికుమార్ రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో స్టాఫ్ యూనియన్ నాయకులు వీవీ ప్రసాద్, సనత్‌కుమార్, కె శ్రీనివాసులురెడ్డి, భువనేశ్వరి, టౌన్ బ్రాంచ్ మేనేజర్ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా కోదండరాముడి కల్యాణం



స్వామివారి ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

కావలి రూరల్, జూన్ 23 : కావలి మండలం చౌదరిపాలెంలోని కోదండరామ స్వామి ఆలయంలో ఆదివారం కోదండరామస్వామి కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పచ్చ తోరణాలతో ముస్తాబు చేసి దేవతామూర్తులను పూలతో ప్రత్యేకంగా అలంకరించి వేద పండితుల మంత్రోశ్చరణ నడుమ స్వామివారి కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించారు. అనంతరం స్వామి వారికి గజవాహనంపై ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళులు



కావలిటౌన్ : ముఖర్జీకి నివాళులర్పిస్తున్న నేతలు



బిట్రగుంట : నివాళులర్పిస్తున్న నాయకులు

కందుకూరు, జూన్ 23: ఏకాత్మతా మానవతావాద సిద్ధాంతకర్త, భారతీయ జనతాపార్టీ ఆద్యుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఆదివారం కందుకూరులో బీజేపీ నేతలు ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు గట్టమనేని హరిబాబు, జొన్నాదుల రాఘవయ్య, మన్నేపల్లి వరప్రసాదరావు, చుండి మురళీధర్, అమలనాధుని మాల్యాద్రినాయుడు, బొర్రా కోటేశ్వరరావు, చిన్ని పాం దురంగయ్య, జాలరాఘవులు, మువ్వల భూషయ్య తదితరులు పాల్గొన్నారు.

కావలిటౌన్ : భారతీయ జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా ఆదివారం పట్టణంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బ్రహ్మానందం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖర్జీ చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం బలిదాన్ దివస్ పురస్కరించుకుని జెడ్పీ పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సహ కోశాధికారి కందుకూరి సత్యనారాయణ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వింతా వెంకటరంగా రెడ్డి, నేతలు సీవీసీ సత్యం, పరుసు వెంకటేశ్వర్లు, మంద కిరణ్, పూనూరు మాధవి తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు : బీజేపీ నేతల నివాళి

బిట్రగుంట : దేశ సమైక్యతకు ప్రాణత్యాగం చేసిన అమరవీరుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ బోగోలు బీజేపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి బీజేపీ నేతలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్, నాయకులు ప్రసాద్‌రావు, గుర్రం వెంకటేశ్వర్లు, వెంకటరమణయ్య, వెంకటక్రిష్ణ యాదవ్, పసుపులేటి సూర్యం, రావి తేజ, ఎస్‌వెంకటేశ్వర్లు, గుత్తి సుధాకర్, ఆవుల అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణపట్నం కంటైనర్ టెర్మినల్‌కు పూర్వ వైభవం

● తీరనున్న ఉద్యోగుల వెతలు



పోర్టుకు వచ్చిన చివరి కంటైనర్ల నౌక (ఫైల్)

ముత్తుకూరు, జూన్ 23: అదాని కృష్ణపట్నం కంటైనర్ టెర్మినల్‌కు పూర్వం వైభవం వస్తుందని స్థానికులు, ఉద్యోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పోర్టుకు లాభాలు ఆర్జించి పెట్టే కృష్ణపట్నం కంటైనర్ టెర్మినల్‌ను గత జనవరిలో తమిళనాడుకు తరలించిన విషయం తెలిసిందే. టెర్మినల్ మూసివేతతో పదివేల మందికి పైగా ఉద్యోగులు రోడ్డునపడ్డారు. బల్క్‌కార్గో పోర్టుగా కృష్ణపట్నంను మార్చేందుకు వీలుగా కంటైనర్ టెర్మినల్ మూసివేయాలని యాజమాన్యం భావించి, అందుకు అనుగుణంగా కంటైనర్ల రవాణాను తగ్గించివేస్తూ గత జనవరిలో పూర్తిగా టెర్మినల్ మూసివేస్తున్నామని, ఇకపై కంటైనర్ సేవలు తమిళనాడులోని కాటుపల్లి, ఎన్నూరు పోర్టులలో లభ్యమవుతాయని స్పష్టంచేశారు. ఈ విషయంలో వైసీపీ ప్రభుత్వం, అప్పటి ప్రజాప్రతినిధులు పూర్తిగా నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించడంతో కంటైనర్ నౌకలను జనవరిలో నిలిపివేశారు. దీంతో మాజీ మంత్రి సోమిరెడ్డి అఖిలపక్షంతో కలిసి పోరాటం చేయడం, రోడ్డునపడ్డ ఉద్యోగుల ఆందోళన, ప్రజలలో వ్యతిరేకత కారణంగా గత మార్చిలో ఖాళీ కంటైనర్ రప్పించి వైసీపీ నాయకులు హంగామా చేశారు. కంటైనర్లు వచ్చాయి తప్ప అప్పటి నుంచి ఒక్కటి కూడా రవాణా అయిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా కంటైనర్ నౌకల రాకపోకలు కొనసాగిస్తూ, పోర్టు యాజమాన్యం కంటైనర్ల రవాణాకు అనుమతులు ఇస్తే, ఆధారిత సంస్థలు తిరిగి కృష్ణపట్నం పోర్టుకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఎన్నికలలో టీడీపీ సంపూర్ణ మెజారిటీతో అధికారంలోకి రావడం, సర్వేపల్లి శాసనసభ్యుడిగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గెలుపొందడంతో కృష్ణపట్నం కంటైనర్ టెర్మినల్‌కు పూర్వవైభవం వస్తుందన్న ఆశలు ఉద్యోగుల్లో చిగురిస్తున్నాయి. అలాగే కృష్ణపట్నం పోర్టు యాజమాన్యంతో మాట్లాడి కంటైనర్ సేవలను కొనసాగించేలా ప్రభుత్వం నుంచి ఒత్తిడి చేసి టెర్మినల్‌ను కొనసాగిస్తారని కంటైనర్ టెర్మినల్ ఆధారిత సంస్థల ఉద్యోగులు ఆశిస్తున్నారు.

తిరుమల పాదయాత్రకు టీడీపీ నేతల సంఘీభావం


రాజాయాదవ్ పాదయాత్రకు సంఘీభావం తెలుపుతున్న టీడీపీ నేతలు, కార్యకర్తలు

వెంకటాచలం, జూన్ 23: సార్వత్రిక ఎన్నికల్లో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సర్వేపల్లి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో మొక్కులో భాగంగా టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ అనికేపల్లి నుండి తిరుమలకు చేపట్టిన పాదయాత్ర రెండో రోజైన ఆదివారం వేకువజామున గూడూరు రూరల్ పరిధిలోని చెన్నూరు నుండి ప్రారంభమై వెంకటగిరి సమీపంలోని అంజనేయపురానికి రాత్రికి చేరుకుంది. పాదయాత్రకు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మావిళ్లపల్లి శ్రీనివాసులునాయుడు, టీడీపీ బీసీ సెల్ నియోజకవర్గ కార్యదర్శి మండల మణియాదవ్, కసుమూరు మాజీ సర్పంచ్ కడివేటి శేషయ్య, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి కూరపాటి మస్తానయ్య, పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు సంఘీభావం తెలిపారు. అలాగే కసుమూరు, వెంకటాచలం, కాకుటూరు, అనికేపల్లి, గొలగమూడి, ఇడిమేపల్లి, తిరుమలమ్మపాళెం, పూడిపర్తి, తిక్కవరప్పాడు గ్రామాల నుండి టీడీపీ నేతలు, కార్యకర్తలు పాదయాత్ర వెంట కొంతదూరం నడిచారు.

ఘనంగా భానురెడ్డి జన్మదిన వేడుకలు


జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న రామిరెడ్డి విజయభానురెడ్డి

విడవలూరు, జూన్ 23: మండల పరిధిలోని ఊటుకూరు గ్రామానికి చెందిన కోవూరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకుడు రామిరెడ్డి విజయభానురెడ్డి జన్మదిన వేడుకలు స్వగ్రామంలో ఆదివారం ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా మండలాధికారులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు. పార్టీ కార్యకర్తల కోలాహలం నడుమ భానురెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ఆయన భారీ కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు, అభిమానులకు పంచారు. ఈ సందర్భంగా భానురెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి, కార్యకర్తల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సింహాద్రి అయ్యప్ప, వేగూరు చంద్రారెడ్డి, పాశం శ్రీహరిరెడ్డి, ఎస్‌కె రఫీ, పొన్నలూరు పురంధర్‌రెడ్డి, సత్యవోలు సత్యంరెడ్డి, తాతా రమేష్, వేల్లంపల్లి దిలీప్, కొండూరు సుధీర్, ఉచ్చూరు సుధీర్‌రెడ్డి, తూళ్ళూరు మాదవ్ పాల్గొన్నారు.

జనసేన బలోపేతానికి కృషి


జెండా ఆవిష్కరణలో జనసేన నేత సురేష్

ముత్తుకూరు, జూన్ 23: గ్రామస్థాయి నుంచి జనసేన పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని సర్వేపల్లి నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు అన్నారు. ఆదివారం పైనాపురంలో స్థానిక నాయకులు కావలి మస్తాన్, కావలి కవిత ఆధ్వర్యంలో జనసేన పార్టీ జెండాని ఆవిష్కరించారు. మండలంలో అన్ని పంచాయతీలలో జెండా ఆవిష్కరణలు చేసి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రజా సమస్యలను పరిశీలించి, పరిష్కరించే దిశలో అడుగులు ముందుకు వేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు రహీం, అశోక్, అక్బర్, నవీన్, వెంకటాచలం మండల నాయకులు శ్రీహరి, మనుబోలు మండల నాయకులు సుధాకర్, జన సైనికులు, జనసేన నాయకులు, వీర మహిళలు, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తరగతి గదుల ప్రారంభం


తరగతి గదులను ప్రారంభిస్తున్న దాత నాగార్జున, ఎంఈవో, ఇన్‌చార్జ్ హెచ్‌ఎంలు

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 23: స్థానిక డీఎల్‌ఎన్‌ఆర్ హైస్కూలు ఆవరణలో నూతనంగా నిర్మించిన రెండు తరగతి గదులను నెల్లూరుకు చెందిన దాత డెర్మటాలజిస్టు డాక్టర్ కొండపి నాగార్జున ఎంఈఓ వీవీ రత్నం, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం షేక్ మస్తాన్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. గతంలో హైస్కూల్లో తెలుగు పండిట్‌గా పనిచేసి రిటైరైన దివంగత కొండపి షణ్ముఖాచార్యులు జ్ఞాపకార్థం వారి కుమారుడు నాగార్జున తరగతి గదుల కోసం తమవంతు సహాయ సహకారాలందించారని హెచ్‌ఎం తెలిపారు. ఈసందర్భంగా స్కూలు ఉపాధ్యాయులు దాతను శాలువాలతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైస్కూలు ఉపాధ్యాయులు, డాక్టర్ మిత్రబృందం పాల్గొన్నారు. కాగా, హైస్కూలు ఆవరణలో నాడు - నేడు పథకం 2వ దశలో చేపట్టిన మూడు అదనపు తరగతి గదులు నిధుల కొరతతో బేస్‌మట్టాలకే పరిమితమై ముళ్ళపొదలతో దర్శనమిస్తున్నాయి.

ఎమ్మెల్యే పదవి కిరీటం కాదు : కురుగొండ్ల


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

సైదాపురం,జూన్ 23: ఎమ్మెల్యే పదవి అంటే కిరీటం కాదని ఒక సామాజిక బాధ్యత అని, ప్రజాసేవ చేసే భాగ్యం అని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. ఆదివారం తుమ్మలతలపూరు రోడ్డు వద్ద ఆంజనేయ స్వామి గుడిలో పూజలు నిర్వహించి కలిచేడు వరకు టీడీపీ విజయయాత్ర ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. టీడీపీ నాయకులు ఎమ్మెల్యేను గజమాలతో సన్మానించారు. మండలాధికారులు, సిబ్బంది ఎమ్మెల్యేకు శాలువా కప్పి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. దారుణంగా ఉన్న రోడ్డుపై ప్రయాణం చేస్తుంటే కన్నీళ్లు వచ్చాయన్నారు. రోడ్డు ఫొటోలను అసెంబ్లీలో సీఎం చంద్రబాబు నాయుడుకు చూపించి సైదాపురం, డేగపూడి మధ్య రెండు మండలాలను కలిపే ప్రధాన రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరతానన్నారు. నియోజకవర్గం అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎస్ఎస్ఆర్ నాయుడు, పార్టీ మండలాధ్యక్షుడు కట్టా మోహన్ కృష్ణారెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త మేడికొండ పద్మమోహన్ నాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జ్ పెమ్మసాని దిలీప్ చౌదరి, కొండూరు సుబ్రమణ్య రాజు పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 23: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆపార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గండి రఘురామయ్య బీజేపీ నేతలు పాల్గొన్నారు.

ఆలయ భూములు కాపాడండి


సమావేశంలో మాట్లాడుతున్న తొగటవీధి నివాసులు

పొదలకూరు, జూన్ 23: పట్టణంలోని తొగట వీధిలో ఉన్న శ్రీబాలచౌడేశ్వరిదేవి అమ్మవారికి చెందిన భూములను కాపాడాలని తొగటవీధి నివాసులు గోవిందు శ్రీనివాసులు, చంద్రశేఖర్, భత్తూరి కృష్ణ, రెబ్బ మహేష్‌లు కోరారు. ఆదివారం స్థానిక బాలచౌడేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారికి చెందిన భూములను ఆలయానికి సమీపంలోని ఓ వ్యక్తి ఆక్రమించుకున్నాడని, వైసీపీ ప్రభుత్వం 388లో ఉన్న అమ్మవారికి సంబంధించిన భూములను సర్వేనెంబరు 390లోకి మార్చివేశారని ఆరోపించారు. అప్పట్లో ప్రశ్నించిన తమపై కేసులు పెడతామని బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. సర్వే నెంబరు 390, 388, 389 భూములను కొలత వేస్తే తమ గ్రామ దేవతైన బాలచౌడేశ్వరికి చెందిన స్థలాలు బయటపడతాయని, ఆ స్థలాన్ని గుర్తించి ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

చాన్‌బాషా సేవలు చిరస్మరణీయం


చాన్‌బాషా సంతాప సభలో నివాళులర్పిస్తున్న టైలర్స్ సంఘం నాయకులు

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 23 : జిల్లాలోని టైలర్ల అభివృద్ధి, సంక్షేమానికి టైలర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, ట్రూఫిట్ టైలర్స్ అధినేత చాన్‌బాషా చేసిన కృషి చిరస్మరణీయమని జిల్లా టైలరింగ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బీ శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు సయ్యద్ మదార్ కొనియాడారు. ఆదివారం చాన్‌బాషా సంతాప సభ సండే మార్కెట్ వ్యాపారుల కార్యాలయంలో జరిగింది. చాన్‌బాషా చిత్రపటానికి పలువురు దర్జీలు పుష్పమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ చాన్‌బాషా టైలర్స్ నాయకుడిగానేకాక రాజకీయ నాయకులతోనే సత్సం బంధాలు కలిగి ఉండేవారన్నారు. ఆయన లేని లోటు టైలర్స్ వర్కర్స్‌కు తీరనిదన్నారు. చాన్‌బాషా కుటుంబానికి టైలర్స్ అసోసియేషన్ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శీనయ్య, ఎస్‌కే గులామ్, ఖాదర్‌బాషా, పసుపులేటి యానాదయ్య, ఆది శేషయ్య పాల్గొన్నారు.

బరితెగిస్తున్న గ్రావెల్, ఇసుక మాఫియా

● భయాందోళనలో గ్రామస్థులు


అర్ధరాత్రి ట్రాక్టర్లకు గ్రావెల్ లోడు చేస్తున్న ఎక్స్‌కవేటర్

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 23: బుచ్చిరెడ్డిపాళెం మండలంలో గ్రావెల్, ఇసుక మాఫియా బరితెగిస్తోంది. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు గ్రావెల్, ఇసుక రవాణాచేసే ట్రాక్టర్ల వేగానికి గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. మండలంలోని రామచంద్రాపురం వద్ద గ్రావెల్ మాఫియా శనివారం అర్ధరాత్రి గ్రావెల్ అక్రమ తవ్వకాలకు దిగింది. గమనించిన గ్రామస్థులు అడ్డుకునే సాహసం చేయలేక మీడియాకి సమాచారమిచ్చారు. దీంతో గ్రావెల్ తవ్వకాల ప్రాంతానికి వెళ్లిన కొంతమంది విలేకరులపై గ్రావెల్ తరలించే ముఠా దాడికి యత్నించారు. పోలీసులు రంగప్రవేశం చేయడంతో ట్రాక్టర్లు, యంత్రాలను వదిలేసి పారిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు దాడికి యత్నించిన వారిని పోలీసులు విచారిస్తున్నారు. కాగా, బుచ్చి మండలంలోని దామరమడుగు నుంచి శ్రీరంగరాజపురం, జొన్నవాడ, మినగల్లు గ్రామాల్లోని పెన్నానదీ తీరాల నుంచి అర్ధరాత్రుల్లో బుచ్చి, కావలి దాకా, దామరమడు వద్ద పెన్నా నదిలో నుంచి ట్రాక్టర్లతో ఇసుక తరలించి కొడవలూరు మండలం యల్లాయపాళెం ప్రాంతంలో డంప్ చేసి అక్కడి నుంచి టిప్పర్లతో కావలికి తరలిస్తున్నారనే ఆరోపణలున్నాయి. సెబ్, పోలీసు, రెవెన్యూ అధికారులు స్పందించి గ్రావెల్, ఇసుక మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

నేడు కార్పొరేషన్‌లో గ్రీవెన్స్

నెల్లూరు(సిటీ), జూన్ 23 : నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ వికాస్ మర్మత్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి ఈ గ్రీవెన్స్ మొదలవుతుందని, నగరంలోని ప్రజలు వారి సమస్యలను అర్జీల రూపంలో తెలియపరిస్తే నిర్ణీత కాలవ్యవధిలోపు పరిష్కరిస్తామని తెలిపారు. గత ప్రభుత్వంలో స్పందన పేరుతో నిర్వహించిన గ్రీవెన్స్‌ను ప్రస్తుతం ప్రజా సమస్యల పరిష్కార వేదికగా మార్చిన విషయం విదితమే.

అవయవదానంపై అవగాహన

నెల్లూరు (విద్య), జూన్ 23 : వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఆదివారం అవయవదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పినాకినీ బాడీ డోనర్స్ సంఘం వ్యవస్థాపకుడు తిక్కవరపు సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ సమాజంలో అవయవదానంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఒకరి అవయవాలను దానం చేయడం వల్ల అవి మరికొందరికి జీవితాన్నిస్తాయని, అదేవిధంగా వైద్య విద్యార్థులు, శాస్త్రవేత్తలకు పరిశోధనలకు ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. అనంతరం వాకర్స్‌కు దీనిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు మేకల నరేంద్రరెడ్డి, అధ్యక్షుడు డీవీ సుబ్బరాజు, కార్యదర్శి స్వర్ణ రమేష్‌బాబు, సభ్యులు పాల్గొన్నారు.

ఏసీ స్టేడియంలో వైద్య శిబిరం

నెల్లూరు (విద్య), జూన్ 23 : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఆదివారం ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. న్యూరాలజిస్ట్ డాక్టర్ యామినీ మాట్లాడుతూ వాకర్స్ ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రధానంగా పక్షవాతం విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఆ వ్యాధి లక్షణాలు కనిపించిన నాలుగు గంటల్లోపు తగిన చికిత్స చేస్తే బాధితుడు పూర్తిగా కోలుకునే అవకాశం ఉంటుందన్నారు. అలాగే పలు వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చర్మవ్యాధి నిపుణుడు హర్షవర్ధన్, వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి షేక్ నసీర్ అహ్మద్, కోశాధికారి సుబ్బరాయుడు, సభ్యులు పాల్గొన్నారు.

గురువాయురప్పన్ పుష్కర మహాసంప్రోక్షణ ప్రారంభం


అంకురార్పణ పూజలు చేస్తున్న పండితులు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 23 : నగరంలోని అయ్యప్పగుడి ప్రాంగణంలో ఉన్న గోదా, మహాలక్ష్మీ సమేత గురువాయూర్ మహావిష్ణు ఆలయంలో ఆదివారం రాత్రి పుష్కర మహా సంప్రోక్షణ, కుంభాభిషేక మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గోపూజ, విష్వక్సేనారాధన, మృత్సంగ్రహణం, అగ్నిప్రతిష్ఠ, అంకురార్పణ, హోమాలు జరిగాయి. ఆలయ చైర్మన్ జీ శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, మురళీమోహన్‌రెడ్డి, అయ్యప్ప సేవా సమాజం సభ్యులు పర్యవేక్షించారు.

యోగా గురువు ప్రసన్నకుమార్‌కు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న ప్రసన్నకుమార్

నెల్లూరు (విద్య), జూన్ 23 : నెల్లూరుకు చెందిన యోగా గురువు ప్రసన్న కుమార్ తమిళనాడులో యోగా గురు పురస్కారాన్ని అందుకున్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించు కుని తమిళ నాడు స్పోర్ట్స్ యోగా అసోసియేషన్, మహిళా జైన్ కళాశాలలు సంయు క్తంగా నిర్వహించిన యోగా గురువుల పురస్కారాల కార్యక్రమంలో ఏపీ, కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన ఉత్తమ గురువులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్‌కు పాండిచ్చేరి యోగాచార్యులు డాక్టర్ ఆనందబాలయోగి, ఇండియన్ యోగా అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ ఆర్ ఇలంగోవన్ అవార్డును అందచేశారు.

దశకుమార చరితంలో అలనాటి నెల్లూరు వైభవం

● చీమకుర్తి వెంకటేశ్వరరావు

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 23 : తిక్కన సోమయాజి శిష్యుడు కేతన రచించిన దశకుమార చరితము గ్రంథంలో తిక్కన నాటి విక్రమ సింహపురి (నెల్లూరు) వైభవం వివరించి ఉందని డీకే మహిళా కళాశాల విశ్రాంత ఆంధ్రోపన్యాసకుడు చీమకుర్తి వెంకటేశ్వ రరావు తెలిపారు. ఆదివారం రేబాల లక్ష్మీనరసారెడ్డి పురమందిరం ఏసీ హాలులో సాహితీవేత్త పాలూరి హనుమజ్జానకీ రామశర్మ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా తిక్కన సోమయాజిపై సాహిత్య ప్రవచనం చేశారు. కేతన రాసిన దశకుమార చరితమును హనుమజ్జానకీ రామశర్మ తిక్కన సోమయాజి నాటకంగా రచించారని తెలిపారు. ఈ నాటకంలో రామశర్మ తిక్కన పాండిత్యాన్ని విక్రమ సింహపురి వైభవాలతోపాటు ఆనాటి విశేషాలు కళ్లకు కట్టినట్లు వివరించారని తెలిపారు. ఈ సభకు మెట్టు రామచంద్రప్రసాద్ అధ్యక్షత వహించగా నలుబోలు బలరామయ్య నాయుడు, వేదం రాధాకృష్ణమూర్తి, కోట రాజశేఖర అవధాని, పీ లక్ష్మీనరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఆదాల అంటేనే మోసం: టీడీపీ నాయకులు

నెల్లూరు(వ్యవసాయం), జూన్ 23 : ఆదాల ప్రభాకర్‌రెడ్డి అంటేనే మోసమని, నయవంచనకు మారుపేరని తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటు నియోజక వర్గ అధికార ప్రతినిధి సాబీర్‌ఖాన్, నాయకుడు మదన్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలు పూర్తయిన 24గంటల్లోనే నమ్మిన నాయకులు, కార్యకర్తలను గాలికొదిలేసిన ఆదాల, అన్నీ సర్దుకుని హైదరాబాద్‌కు పారిపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. జెండావీధి ప్రాంతానికి గతంలో ఏరోజూ పోలీసులు రాలేదని, అలాంటిది అర్ధరాత్రి పోలీసులను పంపించి అక్కడి ముస్లిం మహిళలను భయభ్రాంతులకు గురిచేసింది ఆదాల ప్రభాకర్ రెడ్డేనని ఆరోపించారు. దేవర పాళెంలో పేద, మధ్యతరగతి ప్రజలు కొనుగోలు చేసిన ఇళ్ల స్థలాలను ఆదాల అనుచరులు కబ్జా చేశారని, బాధితులు ఆదాల దగ్గరకు వస్తే హేళనగా మాట్లాడారని విమర్శించారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం


ప్రతిభా పురస్కారాలు అందుకున్న కార్పొరేషన్ పాఠశాలల విద్యార్థులు

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 23 : టౌనుహాలు ట్రస్ట్ బోర్డు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పురమందిరంలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. టౌనుహాలు ట్రస్ట్ ప్రతి ఏటా నగరంలోని కార్పొరేషన్ పాఠశాలల్లో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు పారితోషికం, ప్రశంసాపత్రాలు అందజేస్తోంది. అందులో భాగంగా కార్పొరేషన్ స్కూళ్లలో 10వ తరగతిలో ప్రథమ స్థానం సాధించిన 36 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5వేలు నగదు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్ర మంలో ట్రస్ట్ బోర్డు సభ్యులు వాకాటి విజయకుమార్ రెడ్డి, రేబాల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జే భక్తవత్సలరెడ్డి, నేతాజీ సుబ్బారెడ్డి, సీ వివేకానందరెడ్డి, సీహెచ్ పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



శివాజీ సెంటర్‌లో మొక్క నాటుతున్న బీజేపీ నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 23: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ 71వ వర్ధంతి సందర్భంగా బీజేపీ నాయకులు ఆదివారం నగరంలో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. పార్టీ రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు నగర వ్యాప్తంగా బీజేపీ నాయకులు పుడమి తల్లికి ఒక మొక్క కార్యక్రమం నిర్వహించి మొక్కలు నాటారు.

● శివాజీ సెంటర్‌లో ఏడు అగుగుల మొక్కను నాటారు. బీజేపీ రాష్ట్ర మోర్చాల సమన్వ యకర్త పీ సురేంద్రరెడ్డి మాట్లాడుతూ శ్యాంప్రసాద్ ముఖర్జీ జనసంఘ్ అధ్యక్షుడిగా జమ్మూ కశ్మీర్ సహా ఒకే దేశం.. ఒకే జెండా.. ఒకే ప్రధాని నినాదంతో కశ్మీర్ పర్యటించారని చెప్పారు. ఆ పర్యటనలోనే అనుమానాస్పదరీతిలో మరణించారన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణం గానే నేటి ప్రధాని నరేంద్ర మోదీ పనిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, నాయకులు రాజ్ పురోహిత్, యశ్వంత్ సింగ్, కేవీ సుబ్రహ్మణ్యం, బీఎస్ రంగరాజన్, పేటేటి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

● స్టోన్‌హౌస్‌పేటలోని సాయిబాబా గుడి పార్కు వద్ద పుడమి తల్లికి ఒక మొక్క కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి హర్షవర్ధన్ మాట్లాడుతూ బెంగాల్ విభజన తర్వాత హిందువులపై జరిగిన దాడులకు స్పందిస్తూ డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ భారతీయ జనసంఘ్ పార్టీని స్థాపించారన్నారు. ఆయన చూపిన బాటలో నాటి నుంచి నేటి వరకు కార్యకర్తలు పయనిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా నాయకుడు వేమారెడ్డి సురేంద్రనాథ్‌రెడ్డి, నాయకులు శ్రీనివాసులు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

● మూలాపేటలో శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు మిడతల రమేష్ మాట్లాడుతూ శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదానం స్ఫూర్తితోనే మోదీ ప్రభుత్వం 370 ఆర్టికల్ రద్దు చేసిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగేంద్ర సింగ్, నరేష్, సిరివెళ్ల చంద్ర తదితరులు పాల్గొన్నారు.


మూలాపేటలో శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ శ్రేణులు

ఘనంగా శ్రీవారి జలద్రోణ ఉత్సవం


జలద్రోణ ఉత్సవంలో శ్రీవారు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 21 : నగరంలోని మాగుంటలే అవుట్ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఆదివారం జలద్రోణ ఉత్సవం నిర్వహించారు. ఉదయం హోమం, బలిహరణం, మంగళశాసనం, విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, శ్రీవారి జలద్రోణోత్సవం జరిగాయి. సాయంత్రం శ్రీవారు గజవాహనంపై భక్తులను కటాక్షించారు.

సినీ స్టూడియో ప్రారంభం

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 23 : నగరంలోని ఇస్కాన్ సిటీలో 25 కళా సంఘాల సినీ స్టూడియో ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. దీనిని హైటెక్ ఫార్మా రమణారెడ్డి, నారాయణ గ్రూపు ఆఫ్ హాస్పిటల్స్ ఏజీఎం సీహెచ్ భాస్కర్ రెడ్డి, నిర్మాత షంషుద్దీన్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ నెల్లూరు పరిసరాలు సినిమా షూటింగ్‌కు అనువుగా ఉన్నాయన్నారు. ఇప్పటికే 25 చిత్రాల షూటింగ్ జరుగుతోందని, నెల్లూరును సినిమా హబ్‌గా అభివృద్ధి చేసేందుకు ఈ స్టూడియో ప్రారంభించామని చెప్పారు. సినిమా షూటింగ్‌కు అనువుగా సెట్టింగ్‌లు వేసుకునేందుకు, మేకప్ వేసుకునేందుకు, సినిమా, షార్టుఫిల్మ్, డెమో ఫిల్మ్ కళాకారులు షూటింగ్ చేసుకునేందుకు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కోసూరు రత్నం, దోర్నాల హరిబాబు, శివాజీ యూత్ భాస్కర్‌నాయుడు, డాన్స్ మాస్టర్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

జడ్పీ పాఠశాల విద్యార్థులకు అభినందన

నెల్లూరు (విద్య): బుజబుజ నెల్లూరులోని డీవీఎస్ఎం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం టెన్త్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థుల అభినందన కార్యక్రమం జరిగింది. ప్రథమ స్థానం సాధించిన ఉమామహేశ్వరరావుకు నగదు బహుమతి, ఇతర విద్యార్థులకు జ్ఞాపికలు, విద్యా సామగ్రిని స్థానిక కార్పొరేటర్ బద్దెపూడి నరసింహగిరి బహూకరించారు. ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున రావు, జీజీహెచ్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుడు బ్రహ్మారెడ్డి, పాఠశాల వ్యవస్థాపకుడు దూడల ప్రసాద్‌రావు పాల్గొన్నారు.



తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం సమీపాన వైసీపీకి చెందిన రాజభవనం వెలసింది. ఏడాదిన్నర కిందట అధికారాన్ని అడ్డుపెట్టుకుని అత్యంత ఖరీదైన ప్రభుత్వ భూమిని నామమాత్రపు లీజు ధరపై దక్కించుకున్న వైసీపీ పెద్దలు అందులో ఎలాంటి అనుమతులూ లేకుండా జిల్లా పార్టీ కార్యాలయం పేరిట భారీ భవంతిని నిర్మించారు. ఒకవైపు విమానాశ్రయం, మరోవైపు ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల నడుమ విలువైన భూమిని ఓ రాజకీయ పార్టీకి కేటాయించడమే ఆశ్చర్యకరమైతే దానికి స్థానిక పంచాయతీ నుంచి గానీ, తుడ నుంచి గానీ అనుమతులు లేకపోవడం మరింత ఆశ్చర్యం కలిగిస్తోంది. టీడీపీ అధికారంలోకి రావడంతో రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ కార్యాలయాలకు చేసిన భూ కేటాయింపులు, భవనాల నిర్మాణంపై కొత్త ప్రభుత్వం ఆరా తీస్తోంది. ఈ సందర్భంగా పలు ఆసక్తికరమైన విషయాలు వెల్లడవుతున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

రేణిగుంట మండలం కుర్రకాల్వ వద్ద నిర్మిస్తున్న వైసీపీ కార్యాలయ భవనం

విమానాశ్రయ సమీపాన వైసీపీ రాజభవనం

నామమాత్రపు లీజు ధరతో ఖరీదైన భూమి కేటాయించిన గత ప్రభుత్వం

పరిశ్రమలకు ఇవ్వాల్సిన భూమి రాజకీయ పార్టీకి

పంచాయతీ, తుడ అనుమతులు లేకుండానే నిర్మాణం

ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌లో ఖరీదైన భూమి కేటాయింపు

రేణిగుంట మండలం జీపాలెం పంచాయతీ కుర్రకాల్వ రెవెన్యూ గ్రామం 219-15, 219-16 సర్వే నెంబర్లలోని రెండెకరాల ప్రభుత్వ భూమిని 33 ఏళ్లపాటు వైసీపీ కార్యాలయం కోసం లీజుకు కేటాయిస్తూ 2022 డిసెంబరు 20న అప్పటి ప్రభుత్వం జీవో (నెంబరు 757) జారీ చేసింది. ఎకరాకు ఏడాదికి రూ.వెయ్యి చొప్పున లీజు చెల్లించే ప్రాతిపదికన భూమి కేటాయిస్తున్నట్టు అందులో పేర్కొన్నారు. ఈ భూమి విమానాశ్రయానికి చేరువగా ఆ మార్గంలోనే వుంది. గత టీడీపీ ప్రభుత్వం సరిగ్గా ఇక్కడే ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల ఏర్పాటు కోసం ప్రత్యేకంగా శ్రీవెంకటేశ్వర ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌ను ఏర్పాటు చేసింది. ఈ క్లస్టర్ పరిధిలో ఇప్పటికే కార్బన్ మొబైల్స్, సెల్‌కాన్ మొబైల్స్ వంటి ఎలక్ట్రానిక్స్ వస్తువులు ఉత్పత్తి చేసే పరిశ్రమలు, ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజిటల్ టెక్నాలజీస్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కలినరీ వంటి జాతీయ స్థాయి విద్యా సంస్థలున్నాయి. ఇక్కడి ప్రభుత్వ భూములను ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలు లేదా ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలకు కేటాయించేందుకు ఉద్దేశించారు. బహిరంగ మార్కెట్‌లో ఎకరం విలువ రూ.5కోట్లకుపైగా పలుకుతోంది. ఇలాంటి చోట ఓ రాజకీయ పార్టీకి రూ.10 కోట్ల విలువైన రెండు ఎకరాల భూమిని ఎకరాకు ఏడాదికి కేవలం రూ.వెయ్యి నామమాత్రపు చెల్లింపుతో లీజుపై కేటాయించడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది.

పంచాయతీ ఇచ్చింది నిరభ్యంతర పత్రమే!

వైసీపీ కార్యాలయం కోసం రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించడానికి ఎలాంటి అభ్యంతరం లేదని జీపాలెం పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపింది. భూమి కేటాయింపు ప్రక్రియలో భాగంగా అధికారాన్ని అడ్డుపెట్టుకుని పంచాయతీ పాలకవర్గంతో ఆ మేరకు తీర్మానం చేయించారు.

అనుమతులు లేకుండానే నిర్మాణం

వైసీపీ కార్యాలయ భవన నిర్మాణానికి స్థానిక జీపాలెం పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులూ లేవు. నిర్మాణం ప్రారంభించిన సమయంలో పంచాయతీ సిబ్బంది వెళ్లి వాకబు చేయగా కలెక్టర్ అనుమతి, తుడ అనుమతులు వున్నాయని పనులు చేపట్టిన వ్యక్తులు చెప్పినట్టు సమాచారం. అసలే అధికార పార్టీ కార్యాలయం వ్యవహారం కావడంతో పంచాయతీ సిబ్బంది మిన్నకుండిపోయారని తెలిసింది. కాగా తుడాలో ఆరా తీయగా వైసీపీ కార్యాలయ భవన నిర్మాణానికి అనుమతి కోసం దరఖాస్తు చేయలేదని, తుడా అనుమతులు ఇవ్వలేదని వెల్లడైంది. భవన నిర్మాణం చేపట్టిన స్థలం పారిశ్రామికవాడ పరిధిలో వున్నందున ఏపీఐఐసీ అధికారుల నుంచి ఏమైనా అనుమతి తీసుకున్నారేమోనని ఆరా తీయగా అలాంటిదేమీ లేదని తెలిసింది.

ప్రభుత్వాదాయానికి భారీగా గండి

తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరువగా రూ. 10 కోట్లు విలువైన భూమిని నామమాత్రపు లీజుపై కేటాయించడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడింది. మరోవైపు స్థానిక పంచాయతీ, తుడ నుంచీ అనుమతులు లేకపోవడంతో ఆ రెండు స్థానిక సంస్థలు కూడా భారీగానే ఆదాయం కోల్పోయాయి. ప్లాన్ అప్రూవల్ సందర్భంగా ఎంత విస్తీర్ణంలో, ఎన్ని అంతస్తులతో భవనం నిర్మిస్తున్నారనే దాన్ని బట్టి పంచాయతీకి అప్రూవల్, డెవలప్‌మెంటల్ చార్జీలు చెల్లించాల్సి వుంటుంది. అవన్నీ పంచాయతీ కోల్పోయినట్టయింది.

కూలుస్తారా? క్రమబద్ధీకరిస్తారా?

భూమి ఏదైనా, భవనం ఎలాంటిదైనా పంచాయతీ పరిధిలో నిర్మాణం చేపడితే తప్పనిసరిగా పంచాయతీ నుంచి అనుమతులు పొందాలి. ఎందుకంటే ఆ భవనానికి పంచాయతీయే డోర్ నెంబరు, అసెస్‌మెంట్ నెంబరు కేటాయించాల్సి వుంటుంది. ఆస్తి పన్ను వంటివి నిర్ణయించేది కూడా పంచాయతీయే. మరోవైపు తుడ నుంచి గానీ, ఏపీఐఐసీ నుంచి గానీ అనుమతులు లేవు. ఇవేవీ జరగనపుడు ఆ భవనాన్ని అక్రమ కట్టడంగా పరిగణించాల్సి వుంటుంది. ఈ లెక్కన వైసీపీ కార్యాలయ భవనాన్నీ అక్రమ కట్టడంగానే భావించాలి. ఐదేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా పలువురు టీడీపీ నేతల ఇళ్లను సైతం నిబంధనల ఉల్లంఘన నెపంతో కూల్చివేయించిన వైసీపీ ప్రభుత్వం తమ పార్టీ కార్యాలయానికి మాత్రం ఎలాంటి అనుమతులూ పొందకపోవడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. దీనిపై ప్రస్తుత ప్రభుత్వం ఎలాంటి వైఖరి తీసుకుంటుందనేది ఆసక్తి కలిగిస్తోంది. అనుమతులు లేకపోవడంపై నోటీసులు జారీ చేసి.. క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటుందా? లేకపోతే అక్రమ కట్టడం కింద పార్టీ కార్యాలయ భవనాన్ని కూల్చివేస్తుందా? అన్నది వేచి చూడాల్సి వుంది.



అంతలోనే ఎంత మార్పు

రాజకీయ ఒత్తిళ్లకు దూరంగా తిరుపతి కార్పొరేషన్ అధికారులు

గత, వర్తమాన పాలనను పోల్చుకుంటున్న యంత్రాంగం

తిరుపతి, ఆంధ్రజ్యోతి

వైసీపీ ప్రభుత్వంలో చిన్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌పై తనిఖీలు చేయాలన్నా తిరుపతి నగరపాలక సంస్థ అధికారులు వణికిపోయేవారు. ఫిర్యాదులపై అటువైపు వెళ్లగానే స్థానిక కార్పొరేటర్ నుంచో, వైసీపీ నాయకుల నుంచో తీవ్రమైన ఒత్తిళ్లు వచ్చేవి. దీంతో అధికారులు నామమాత్రంగా తనిఖీలు ముగించుకుని తిరుగుముఖం పట్టేవారు. ఇప్పుడు అలా కాదు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చీరాగానే తిరుపతిలో పేరుమోసిన ప్రముఖ హోటల్‌ను అధికారులు సీజ్ చేయగలిగారు. తిరుమల బైపాస్ రోడ్డులోని పీఎస్4 హోటల్లో భోజనం ప్లేటులో జెర్రి కనిపించడంతో వినియోగదారుడి ఫిర్యాదు మేరకు కార్పొరేషన్ ఆరోగ్య విభాగం అధికారులు, జిల్లా ఆహార భద్రతాధికారులు హుటాహుటిన చేరుకుని హోటల్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. కిచెన్‌లో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని గుర్తించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో హోటల్‌ను సీజ్ చేశారు. వాస్తవానికి ఇదే పేరుగల మరో బ్రాంచ్ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మకు చెందిన స్థలంలో (శిల్పారామం ఎదురుగా) ఉంది. హోటల్ యాజమాన్యం అటువైపు నుంచి ఒత్తిడి తీసుకొచ్చే ప్రయత్నం చేసినట్టు తెలిసింది. అయితే ఘటన పూర్వాపరాల గురించి మాత్రమే అధికారులను పార్టీ నేతలు ఆరా తీసినట్టు సమాచారం. అంతేగానీ హోటల్ తెరవండని ఒత్తిడి చేయలేదని అధికారులు చెప్పుకుంటున్నారు. అదే వైసీపీ ప్రభుత్వంలో ఇంత పెద్ద హోటల్‌ను సీజ్ చేస్తే గల్లీ స్థాయి నాయకుడు కూడా దబాయింపులకు దిగేవారని గత అనుభవాలను గుర్తుచేసుకుంటున్నారు.

గతంలో చేతులు కట్టేసి..

గత ప్రభుత్వంలో కార్పొరేషన్ ఆరోగ్య విభాగానికి వైసీపీ శ్రేణులు చేతులు కట్టేశాయి. అధికారుల విధులకు అడుగడుగునా అడ్డుతగిలేవారన్న విమర్శలున్నాయి. కొందరు అధికారులైతే వారితో చేతులు కలిపి, చెప్పిందంతా చేసినవారూ ఉన్నారు. మరికొందరు ఒత్తిళ్లకు తట్టుకోలేక బదిలీపై వెళితే, ఇంకొందరు అసంతృప్తితో పనిచేసుకుంటూ వచ్చారు. ఏడాది క్రితం లక్ష్మీపురం సర్కిల్ సమీపంలోని బార్బిక్యూ హోటల్‌తోపాటు మరో బిరియాని సెంటర్లో తనిఖీలు చేసి చర్యలు తీసుకోబోతే వైసీపీ నేతలు పంచాయితీ చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. స్థానిక 17వ డివిజన్లోని గోపాల్‌రాజు కాలనీలోని జనావాసాల మధ్య గొర్రెల దొడ్డిని తొలగించాలని స్థానికుల ఫిర్యాదు మేరకు కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్, వెటర్నరీ ఆఫీసర్లు పరిశీలించి.. ఖాళీచేయాలని ఆదేశిస్తే వైసీపీ నేతలు అధికారులపై మండిపడ్డట్టు సమాచారం. వాటిని ఖాళీ చేయించకుండా అడ్డుకున్నట్టు తెలిసింది. అంతెందుకు ఓ చికెన్ షాపు వేస్ట్ కాలువలో వేస్తున్నారని తెలుసుకుని అధికారులు వెళితే.. ఓ కోఆప్షన్ మెంబర్ ఫోనులోనే అధికారులను బెదిరించి అక్కడినుంచి పంపించేసినట్టు తెలిసింది. ఇలా కథలు కథలుగా గత ప్రభుత్వంలో జరిగిన వైసీపీ నేతల దబాయింపులు గురించి చెప్పుకుంటున్నారు.

ఆ ఉద్యోగులపై చర్యలెందుకు తీసుకోలేదు?

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

● ఆరా తీసిన ఇన్‌చార్జ్ కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 23: 'ఎన్నికల విధులకు గైర్హాజరైన అధికారులకు నోటీసులిచ్చినా సుమారు 30మందికిపైగా వివరణ ఇవ్వలేదా? ఇది క్రమశిక్షణ ఉల్లంఘన కిందే లెక్క. పోలింగ్ పూర్తయి ఇన్ని రోజులైనా ఆ ఉద్యోగులపై ఎందుకు చర్యలు తీసుకోలేదు?' అని కలెక్టరేట్ అధికారులను ఇన్‌చార్జ్ కలెక్టర్ ధ్యానచంద్ర ఆరా తీసినట్లు తెలిసింది. వైసీపీ ప్రభుత్వమే మళ్లీ అధికారంలోకి వస్తుందన్న ధీమాతో కొందరు వివరణ ఇవ్వలేదని 'ఆ ఉద్యోగులపై కొరడా' శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ధ్యానచంద్ర.. వివరణ ఇవ్వని ఉద్యోగులకు సంబంధించిన ఫైల్ సోమవారం ఉదయంకల్లా తనవద్దకు రావాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం. అలాగే ఎన్నికల రెండో దఫా శిక్షణ కార్యక్రమానికి గైర్హాజరైన ఏడుగురు ఉద్యోగుల వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.

తిరుపతిలోని రుయా ఆస్పత్రి సీఎస్ ఆర్ఎంవో లక్ష్మా నాయక్ ఆగడాలతో విసిగిపోయిన యంత్రాంగం ఆధారాలతోసహా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. దీంతో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ (డీహెచ్)కు సరెండర్ చేస్తూ డీఎంఈ (డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్) వారం కిందట ఉత్తర్వులు జారీ చేశారు. కానీ అవేమీ పట్టించుకోకుండా తన చాంబర్‌లో వచ్చి కూర్చొని డ్యూటీ చేయడం మొదలుపెట్టడంతో ఆగ్రహించిన సూపరింటెండెంట్ మూడ్రోజుల కిందట ఆయన గదికి తాళాలు వేసేశారు. ఇదిలా ఉంటే మెడికల్ సర్టిఫికెట్ల కోసం వచ్చిన వారినుంచి సీఎస్ ఆర్ఎంవో వసూళ్లకు పాల్పడిన వీడియోలు తాజాగా వెలుగులోకి వస్తున్నాయి.

రుయాలో వసూల్ నాయక్

● ఏపనికైనా చేయి తడపాల్సిందే ● సీఎస్ ఆర్ఎంవో స్థాయి అధికారిపై సర్వత్రా విమర్శలు ● డీహెచ్‌కు సరెండర్ చేసిన డీఎంఈ

రుయాస్పత్రిలో సీఎస్ ఆర్ఎంవోగా గత ఏడాది జనవరిలో బాధ్యతలు చేపట్టిన లక్ష్మానాయక్ ప్రతి పనికీ ఓ రేటు నిర్ణయించి జోరుగా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే విమర్శలు, ఫిర్యాదులున్నాయి. దీనికితోడు ఉద్యోగులతో దురుసుగా వ్యవహరించడం, మహిళా సిబ్బందిని వేధింపులకు గురిచేయడంతోపాటు రాత్రిళ్లు తనిఖీల పేరుతో మద్యం తాగి విధుల్లోని వైద్యులు, సిబ్బందిని దుర్భాషలాడతారట. ఈ విషయంపై ఇప్పటికే పీజీలు, హౌస్ సర్జన్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసి ఉన్నారు.

సరెండర్ చేసింది వాస్తవమే

సీఎస్ ఆర్ఎంవో లక్ష్మానాయక్‌పై ఇప్పటికే పలు ఫిర్యాదులు అందాయి. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోపాటు సిబ్బందితో దురుసుగా ప్రవర్తిస్తుండటం, ఏజెన్సీ నిర్వాహకులను వేధించడం, మెడికల్ సర్టిఫికెట్ల కోసం వచ్చేవారిని ఇబ్బంది పెట్టడం వంటి పలు ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయి. వీటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.ఆయన్ను సరెండర్ చేయాలని ఆదేశించారు.దాంతో సరెండర్ చేయడంతోపాటు రిలీవ్ చేసింది వాస్తవమే. కానీ ఆయన తన గదిలోనుంచి వెళ్లకుండా కూర్చొని ఉన్నారు. ఇదేమని అడిగితే దురుసుగా ప్రవరిస్తున్నారు. ఈ విషయాన్ని కూడా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి ఆదేశాల మేరకు గదికి తాళం వేశాం.

- రవిప్రభు, సూపరింటెండెంట్, రుయాస్పత్రి

వసూళ్లు ఇలా..

సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగులతోపాటు కొన్ని ప్రైవేటు సంస్థలకు చెందిన ఉద్యోగులకు మెడికల్ లీవ్ కావాలంటే ఆర్ఎంవో, సీఎస్ ఆర్ఎంవో స్థాయి అధికారులు సంబంధిత ధ్రువీకరణ సర్టిఫికెట్లు మంజూరు చేయాలి. ఈ మెడికల్ సర్టిఫికెట్ల కోసం రోజుకు దాదాపు 20 మందికిపైగా రుయాస్పత్రికి వస్తుంటారు. దీన్నే సీఎస్‌ఆర్ఎంవో స్థాయి అధికారి.. ఆదాయ వనరుగా మార్చుకున్నారట. బాధితుల అవసరాన్ని బట్టి మెడికల్ సర్టిఫికెట్ మంజూరుకు రూ.2వేల నుంచి రూ.5వేల వరకు వసూలు చేస్తారట. దీంతోపాటు ఆస్పత్రిలోని సిబ్బందికి కోరుకున్న చోట డ్యూటీ కావాలన్నా ఆయన అడిగినంత ఇవ్వాలట. వీటితోపాటు పారిశుధ్య, సెక్యూరిటీ, రోగులకు ఆహారం సరఫరా చేసే ఏజెన్సీల పనితీరును పరిశీలించి ప్రతి నెలా తగిన మార్కులు వేసి.. బిల్లులు మంజూరు చేయడానికీ రూ.లక్షలు వసూలు చేస్తారట.

ప్రైవేటు వ్యక్తులతో వసూళ్ల పర్వం

మెడికల్ సర్టిఫికెట్లు, సిబ్బందిని భయపెట్టేందుకు ఇచ్చే మెమోలను తయారు చేసేందుకు, నగదు వసూళ్ల కోసం ఏకంగా ఇద్దరు ప్రైవేటు వ్యక్తులను తన చాంబర్‌లో నియమించుకున్నారట. దీంతో వీరిద్దరే అన్ని పనులు చూసుకోవడంతోపాటు సిబ్బందికి దిశానిర్దేశం కూడా చేస్తుండటంతో ఉన్నతాధికారులు సీఎస్ ఆర్ఎంవోను మందలించినా ఫలితం లేకపోయిందట.

- తిరుపతి(వైద్యం)




మెడికల్ సర్టిఫికెట్ మంజూరు చేసేనందుకు బాధితుడి నుంచి నగదు తీసుకుంటున్న సీఎస్ ఆర్ఎంవో లక్ష్మానాయక్ (ఫైల్‌ఫోటో)

మళ్లీ మొదలైన తమిళ జాలర్ల ఆట

● ఆంధ్రా సముద్ర జలాల్లోకి చొరబాటు

● మత్స్య సంపదను తన్నుకెళ్లడమేకాక వలలనూ ధ్వంసం చేస్తున్నారు

● లబోదిబోమంటున్న జిల్లాలోని గంగపుత్రులు



కోట మండలం గోవిందపల్లిపాళెం సముద్రం ఒడ్డుకొచ్చిన తమిళబోట్లు

కోట, జూన్ 23: సముద్రంలో చేపలను వేటాడేందుకు వెళ్లిన జిల్లాలోని మత్స్యకారులకు చేదు అనుభవం ఎదురవుతోంది. చేపల కోసం వలలు విసిరి, పట్టుకోబోయే సమయంలో హైస్పీడ్ మోటరు బోట్లతో తమిళ జాలర్లు ఆంధ్రా జలాల్లోకి చొరబడుతున్నారు. వలలను ధ్వంసం చేయడమేకాక, మత్స్య సంపదనూ తన్నుకెళుతున్నారు. అడ్డుకున్న వారిపై దాడులకూ తెగబడుతున్నారు. వల ఒక్కోటి రూ.50వేల నుంచి రూ.75వేల వరకు ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒట్టి చేతులతో ఇంటికి..

కోట, వాకాడు మండలాల్లో సుమారు 14 మత్స్యకార గ్రామాలున్నాయి. వీటిల్లో 29వేలకుపైగా మత్స్యకారులు చేపల వేటపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. 61 రోజుల వేట విరామం తర్వాత కోట మండలం గోవిందపల్లి పాళెం, కొత్తపట్నం, శ్రీనివాససత్రం, యమదిన్నెపాళెం, గున్నంపడియా గ్రామాలకు చెందిన మత్స్యకారులు సముద్రంలో చేపలవేటకు వెళ్లారు. అక్కడ చేపలవేట అటుంచితే తమిళ జాలర్లు సృష్టించే బీభత్సాన్ని తట్టుకుని.. పోరాడలేక ఒట్టి చేతులతో ఇంటికి వస్తున్నారు.

ఆకలి కేకలు

రెండు నెలల చేపల వేట విరామంతో మత్స్యకారులు ఆర్థికంగా కొంత ఇబ్బందులు పడ్డారు. తీరా ఇపుడు తమిళ జాలర్ల రూపంలో వేట కొనసాగక పోవడంతో మత్స్యకార గ్రామాలు మళ్లీ ఆకలి కేకలు పెడుతున్నాయి. ఇకనైనా తమ సమస్యను పరిష్కరించాలని గంగపుత్రులు కోరుతున్నారు.

హైస్పీడ్ మోటర్ బోట్లతో.. : తమిళనాడులోని నాగూరు, నాగపట్టినం, తూత్తుకుడి తదితర ప్రాంతాల నుంచి తమిళ జాలర్లు హైస్పీడ్ మోటర్లు కలిగిన బోట్లతో సముద్రంలోకి వేటకు వస్తున్నారు. వారు తమిళనాడు సరిహద్దులు దాటి ఆంధ్రా జలాల్లోకి చొరబడుతున్నారు. గతంలో సముద్రం తీరం నుంచి 80-120 కిలోమీటర్ల వరకు మాత్రమే వచ్చి చేపలను పట్టుకుని వెళ్లేవారు. ప్రస్తుతం సముద్రతీరం వరకువచ్చేస్తున్నారు.

ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు ఇన్‌చార్జి ఎస్పీగా హర్షవర్ధన్‌రాజు



హర్షవర్ధన్ రాజు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 23: శేషాచలం అడవుల్లోని ఎర్రచందనం పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్సుకు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజును ఇన్‌చార్జి ఎస్పీగా నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తూ.. వైసీపీ వీర విధేయుడిగా పేరుపొందిన రిషాంత్‌రెడ్డిని డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో ఆయన ప్రస్తుతం సెలవులో ఉన్నారు. దీంతో హర్షవర్ధన్ రాజు సోమవారం బాధ్యతలు తీసుకోనున్నారు.

కలెక్టరేట్‌లో నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

తిరుపతి (కలెక్టరేట్), జూన్ 23: కలెక్టరేట్‌లో మీకోసం-ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని సోమవారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నారు. అన్నిశాఖల అధికారులు హాజరు కావాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ ధ్యానచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు.

ముత్యాలమ్మకు పూజలు

చిల్లకూరు, జూన్ 23: మండలంలోని తూర్పుకనుపూరులో కొలువై ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

స్వర్గధామం అభివృద్ధికి నగదు వితరణ

నాయుడుపేట, జూన్ 23: పట్టణంలోని స్వర్ణముఖినది పరివాహక ప్రాంతంలో ఏర్పాటు చేసిన హిందూ శ్మశానవాటిక (స్వర్గధామం) అభివృద్ధికి బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.దయాకర్‌రెడ్డి రూ.50వేలను ఆదివారం నిర్వాహకులకు అందజేశారు. దయాకర్‌రెడ్డి సోదరుడు సురేష్‌రెడ్డి జ్ఞాపకార్థం స్వర్గధామం అభివృద్ధికి నగదు అందించారు.

బాలికపై అత్యాచారం

గూడూరు, జూన్ 23: మండలంలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన సంఘటన చోటు చేసుకుంది. రూరల్ పోలీసుల వివరాల మేరకు... మండలానికి చెందిన ఇద్దరు యువకులు బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లు కుటుంబసభ్యులు రూరల్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఎస్ఐ మనోజ్‌కుమార్ యువకులను పోక్సోయాక్ట్ కింద అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్‌బీకేఆర్‌లో కొనసాగిన వార్షిక శిక్షణ తరగతులు

కోట, జూన్ 23: మండలంలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండో రోజు ఎన్‌సీసీ వార్షిక శిక్షణ తరగతులు జరిగాయి. ఎన్‌సీసీ నెల్లూరు లెఫ్టినెంట్ కమాండెంట్ గణేష్ ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాలు, నివారణ చర్యలు, ఆరోగ్యం, పరిశుభ్రత, మోడలింగ్‌పై అవగాహన కల్పించారు. పలు జిల్లాల నుంచి 639 మంది క్యాడెట్లు హాజరైనట్లు ఆఫీసర్లు మల్లికార్జున్‌రెడ్డి, నరేంద్రబాబు తెలిపారు. అగ్నిమాపక అధికారి హరీష్, కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అబలాగ్రహం...

కాగుతున్న వంటనూనెను భర్తపై పోసిన భార్య



చికిత్స పొందుతున్న ఉదయయకుమార్

సూళ్లూరుపేట, జూన్ 23: భర్తపై కోపంతో పొయ్యిపై కాగుతున్న నూనెను పోసింది. పోలీసుల సమాచారం మేరకు... ఆబాక పంచాయతీ అమ్మలపాడుకు చెందిన కె.ఉదయకుమార్ తడ మండలం వాటంబేడుకు చెందిన మస్తానమ్మను 9 సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. బేల్దారీ పనులకు వెళ్లే ఉదయకుమార్ ప్రతిరోజు మద్యం తాగి వచ్చి భార్యతో గొడవ పడేవాడు. ఈ నేపథ్యంలో ఆదివారం మద్యం తాగి బిర్యానీ పార్సిల్ తీసుకొని ఇంటికి వచ్చాడు. మద్యం తాగి ఇంటికి రావద్దని చెప్పినా ఎందుకొచ్చావని మస్తానమ్మ భర్తతో వాగ్వాదానికి దిగింది. అంతేకాకుండా ఆగ్రహంతో పొయ్యిపై కాగుతున్న నూనెను భర్తపై పోసేసింది. దీంతో ఉదయకుమార్‌కు ముఖం, మెడపై బొబ్బలు లేచాయి. గమనించిన చుట్టుపక్కల వాళ్లు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ఉదయకుమార్‌ను సూళ్లూరుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స చేసిన వైద్యులు ప్రాణాపాయం లేదని తెలిపారు. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా శ్రీవారి రథోత్సవం

గూడూరు అర్బన్, జూన్ 23: పట్టణంలోని రాజావీధిలో కొలువై ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి రథంపై అధిష్ఠింపజేశారు. భక్తులు గోవింద నామస్మరణాల నడుమ రథాన్ని లాగారు. రాత్రికి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అశ్వవాహనంపై అధిష్ఠింపజేసి గ్రామోత్సవం జరిపారు.

12 మంది ఎస్టీ గురుకుల విద్యార్థులకు అస్వస్థత

- మరో ముగ్గురికి పాఠశాలలోనే చికిత్సలు
- కలుషిత తాగునీటి కారణంగానే!



విద్యార్థులకు అందుతున్న చికిత్సలపై అడిగి తెలుసుకుంటున్న ఆర్డీవో

గూడూరు, జూన్ 23: మండలంలోని చెన్నూరులో ఉన్న ఎస్టీ గురుకుల పాఠశాలలో 12మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు లోనైన ఘటన ఆదివారం వెలుగు చూసింది. చెన్నూరు ఎస్టీ గురుకుల పాఠశాలలో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 144 మంది విద్యార్థులు చదువుతున్నారు. శనివారం మధ్యాహ్నం భోజన సమయంలో విద్యార్థులు తాగునీటి కోసం వెళ్లగా పాఠశాలలో ఉన్న ఆర్వో మినరల్ ప్లాంటు పని చేయలేదు. దీంతో మున్సిపల్ కొళాయి నీటిని కొంతమంది విద్యార్థులు తాగారు. శనివారం సాయంత్రం ఆరుగురు విద్యార్థులకు విరేచనాలు, వాంతులు కావడంతో ప్రిన్సిపాల్, వార్డెన్లు వారిని గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఏరియా ఆసుపత్రిలో ఆర్డీవో కిరణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక చికిత్స అనంతరం నెల్లూరు నగరంలోని జయభారత్ ఆసుపత్రికి తరలించారు. ఆదివారం గురుకుల పాఠశాలలో చెన్నూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఉదయం మరో ఆరుగురిని నెల్లూరుకు తరలించారు. ఈ క్రమంలో మరో ముగ్గురు విద్యార్థులు అస్వస్థతకు లోను కావడంతో వారికి పాఠశాలలోనే వైద్యసిబ్బంది వైద్యసేవలందించారు. ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సూచనల మేరకు టీడీపీ నాయకులు ఎ.శ్రీనివాసులురెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, శివకుమార్ చికిత్స పొందుతున్న విద్యార్థులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ మధుసూదన్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు.

తిరుమలకు కాలినడకన ఓజిలి టీడీపీ నేతలు



ఓజిలి, జూన్ 23: మండల టీడీపీ నాయకులు ఆదివారం తిరుమలకు కాలినడకన బయలు దేరారు. తమ పార్టీ అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ ఎమ్మెల్యే విజయం సాధించడాన్ని పురస్కరించుకుని కె.సత్య వరప్రసాద్‌రావు, పి.వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో 25 మంది తిరుమలకు బయలు దేరారు. సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, గున్నం సేవా ట్రస్ట్ అధినేత గున్నం మధురెడ్డి జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పార్టీ మండల కన్వీనరు జి.విజయకుమార్‌నాయుడు, మైనారిటీ నాయకులు ఎస్‌కె ఖలీల్, బి.రవీంద్రారెడ్డి, పి. వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

29, 30 తేదీల్లో కోటమ్మ ఉత్సవాలు

కోట, జూన్ 23: కోట గ్రామదేవత కోటమ్మ అమ్మవారి ఉత్సవాలు ఈ నెల 29, 30 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త ఎస్. జగన్మోహన రెడ్డి తెలిపారు. ఆదివారం కోటమ్మ ఆలయంలో ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఉత్సవాలకు తిరుపతి, ఉమ్మడి నెల్లూరుజిల్లాల నుంచి పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నట్లు తెలిపారు.

టిడ్కో గృహాల్లో వసతుల మెరుగు: టీడీపీ

గూడూరు, జూన్ 23: టిడ్కో గృహాల్లో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ చొరవతో వసతులు మెరుగుపరుస్తున్నట్లు టీడీపీ మాజీ కౌన్సిలర్ వి. శివకుమార్ అన్నారు. ఆదివారం టిడ్కో గృహాల సమీపంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో బోర్ల తవ్వకానికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో గృహాల్లో వైసీపీ ప్రభుత్వం ఎటువంటి అభివృద్ధిపనులు చేపట్టకపోవడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారన్నారు. దీంతో ఎమ్మెల్యే పాశిం సమస్యను తెలుసుకుని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఆదివారం రెండు బోర్లను తవ్వించారన్నారు. ఈ బోర్లుకు మోటర్లను ఏర్పాటు చేసి నీరు సరఫరా చేస్తామన్నారు. పరిసరాల్లో చెత్తాచెదారం తొలగించడంతోపాటు వీధిదీపాలు వెలిగేలా, వసతులు మెరుగుపడేలా చర్యలు చేపట్టామన్నారు. ఎట్టి నాగరాజు, టీడీపీ నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో బైక్ దగ్ధం

గూడూరు, జూన్ 23: పట్టణంలోని కుమ్మరవీధిలో ఆదివారం షార్ట్‌సర్క్యూట్ కారణంగా ద్విచక్రవాహనం దగ్ధమైంది. అగ్నిమాపకశాఖ అధికారి చలమయ్య వివరాల మేరకు... కుమ్మరవీధికి చెందిన కిషోర్ తన బైక్‌లో ఇంటి నుంచి బయలుదేరాడు. వాహనంలోని బ్యాటరీ వద్ద షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి. వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. దీంతో సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.